# చిలకమర్తి కవితావైభవం

డాక్టర్ ముక్తేవి భారతి

Blank Page

# చిలకమర్తి కవితా వైభవం

రచన

డా॥ ముక్తేవి భారతి

ప్రచురణ

రిజిష్టర్డు నెం 1/64

యువభారతి

5, కింగ్స్ వే,

సికింద్రాబాద్ - 500 003.

CHILAKAMARTI KAVITHA VYBHAVAM

Poetic Selections of Chilakamarthi Lakshmi Narasimham with Literary Commentary By Dr. Muktevi Bharathi.

© YUVA BHARATHI Secunderabad - 500 003.

ప్రచురణ : 105

ప్రథమ ముద్రణ :
అక్టోబర్ 5, 1984

ప్రతులు : 3,200

ముఖ చిత్రం : శీలా వీర్రాజు

ముద్రణ :
ఎ. ఎస్. ఆర్ట్ ప్రింటర్స్,
తిలక్‌నగర్, న్యూనల్లకుంట.
హైదరాబాద్ - 44.

ముఖచిత్ర ముద్రణ :
గీతా ఆర్ట్ ప్రింటర్స్,
కాచిగూడా, హైదరాబాద్.

ప్రతులకు :

ఉత్తర ప్రత్యుత్తరాలకు –
యువభారతి
5 కింగ్స్‌వే, సికిందరాబాదు, 500003

స్వయంగా వచ్చి కలవదలిస్తే : యువభారతి కార్యాలయం
ఆంధ్ర సారస్వత పరిషత్ భవనాలు,
తిలక్ రోడ్డు, హైదరాబాదు, 500001

చుట్టూరా
ఆవరించుకునివున్న చీకటిని
తిట్టుకుంటూ కూర్చోవడంకంటె
ప్రయత్నించి
ఎంత చిన్నదీపాన్నయినా
వెలిగించడం మంచిది
అన్న వాక్యమే మా యువభారతికి

వెల : రూ. 3/-

# యువభారతి పరిచయం

ఉత్తమ అధ్యయనం వల్ల వ్యక్తిత్వానికి సమగ్రత చేకూరుతుంది. సమాజంలో సామరస్యం పెంపొందుతుంది. ఉత్తమ భావ ప్రసరణానికి పుస్తకాలు చక్కని సాధనాలు అందరికీ అందుబాటులో ఉండే విధంగా మంచి పుస్తకాలను అందించే ప్రయత్నానికి యువభారతి పూనుకొని గడచిన ఇరువయ్యేళ్ళుగా పాత కొత్తల మేలు కలయికను ప్రాతిపదికగా పెట్టుకొని నూరు పుస్తకాలను ప్రచురించినది. ఉపన్యాస మంజరీ కార్యక్రమాలను, సదస్సులను నిర్వహించింది.

సహృదయుల సహకారంతో పుస్తకాల అమ్మకం వల్ల వస్తున్న ద్రవ్యంతో పుస్తకాలను ప్రచురిస్తూ తక్కువ వెలకు ఎక్కువ విలువ ఉన్న సాహిత్యాన్ని అందించడానికి యువభారతి ఉద్యమిస్తున్నది. ఉత్తమ సాహిత్య ప్రచారాన్ని ధ్యేయంగా పెట్టుకొని, ప్రచురణలను వెలువరిస్తున్నదే కాని మా సంస్థ వ్యాపార సంస్థ కాదు.

భారత దేశంలో ఎక్కడున్నా సరే యువభారతి నిర్వహిస్తున్న సాహిత్యోద్యమంలో పాలు పంచుకొనేందుకు ప్రారంభించబడిన సాహితీ మిత్ర పథకంలో 8,500 మంది సహృదయులు చేరి ప్రణాళికను విజయవంతం చేసినారు. యువభారతీ భవిష్యన్నిర్మాణంలో సహకరించేందుకు ఆరంభించబడిన సభ్యత్వ పథకాలలో భారతీ మిత్రులుగా 1100 మంది భారతీభూషణులుగా 125 మంది చేరారు.

హైదరాబాదు.
అక్టోబరు 5, 1984

ఇరివెంటి కృష్ణమూర్తి
అధ్యక్షులు, యువభారతి.

# మా మాట

దైవం చిన్నచూపుతో తగినంత చూపును ప్రసరించలేకపోయినా, తన ప్రజ్ఞా చక్షువులతో లోకాన్ని సందర్శించి పండిత పామరులకు అందుబాటులో ఉండే శైలిలో రచనలు సాగించి తెలుగు పఠితృలోకానికి వినోదాన్ని ప్రసాదించిన మహనీయుడు శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహము ఆయన చారిత్రిక, సాంఘిక పౌరాణిక నవలలు. జీవిత చరిత్రలు, స్వతంత్ర, అనువాద నాటకాలు స్వీయ చరిత్ర ఆశు పద్యాలు తెలుగు వాళ్ళకు అవశ్యపఠనీయాలైనవి. సంఘసంస్కరణోద్యమంలో వీరేశలింగం పంతులుగారికి బాసటగా నిలిచిన ప్రజాసేవాపరాయణుడు "నీవు చెప్పిన విద్యయే నీరజాక్ష" ముదితల్ నేర్వగరాని విద్యకలదే ముద్దార నేర్పించినన్" భరతఖండంబు చక్కని పాడియావు" వంటి పద్యోక్తులు సామెతలు సంపాదించుకున్న ప్రాచుర్యాన్ని అందుకో జాలినవి. ఆయన భాషలోని సారళ్యం అలాంటిది. ఆ మనిషి రచనలు చదువనివాడు ఆధునిక ఆంధ్ర సాహిత్యోద్యానంలో ఒక విరబూచిన అరుదైన ప్రసూనవల్లరిని చూడనివాడే! ఆఘ్రాణించని వాడే!

డాక్టర్ శ్రీమతి ముక్తేవి భారతి, రాజాబహద్దర్ వెంకటరామరెడ్డి మహిళా కళాశాలలో ఆంధ్రోపన్యాసకురాలు పుట్టిన ఇల్లు మెట్టిన ఇల్లు సాహిత్యపరిమళాలకూ, ఉత్తమ సంస్కారాలకూ మనికిపట్టు చిలకమర్తివారి సాహిత్యాన్ని మథించి పరిశోధన చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయం వారి పి.హెచ్. డి. పట్టా సంపా సంపాదించుకున్న విదుషీమణి ఆమె. ధారామధురంగా ప్రసంగించగల వక్తృత్వాన్ని అలవరచుకున్నారామె మా యువభారతి అభ్యర్థనను కాదనకుండా చిలకమర్తి సాహిత్యసింధువును చిలికి నవనీత దృశములైన కొన్ని పద్యాలను ఏరి వాటికి సరళమైన వ్యాఖ్యానాన్ని వ్రాసి ఇచ్చి మాకు ప్రచురించుకొనే అవకాశాన్ని కల్పించిన శ్రీమతి ముక్తేవి భారతి ఔదార్యానికి మా ధన్యవాదాలు.

ఇరివెంటి కృష్ణమూర్తి
5-10-1984 అధ్యక్షుడు

# చిలకమర్తి కవితావైభవం

భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు. మూతులు బిగియగట్టి

చిలకమర్తి వారి పేరు వినగానే తెలుగువారి నాలుకలపై తేనెలూరించే తేట గీతి ఇది.

ఆంగ్లేయులు భారతదేశాన్నాక్రమించి ఈ దేశాన్ని దోచుకుంటున్నారని చెప్పదలచుకున్న చిలకమర్తి, దాంట్లో కవితాస్వరూపాన్ని రూపుకట్టించడమే కాకుండా, ప్రతిపద్యాంశానికి కథాస్వరూపాన్ని సంతరించి హృదయాహ్లాదక లక్షణాన్ని ఉద్దీపింపజేశారు. ఒక భావాన్ని అలంకృతం చేసి చెప్పడం కన్నా, అలంకరణలోనే ఒక గాథను సృష్టించడం వస్తుతః కథకుడైన కవి మాత్రమే చేయగలడు. చిలకమర్తి వ్యక్తిత్వంలో ఆత్మస్థానీయమైంది. వారి కథా కథనశక్తి, ఉక్తిస్థానీయమైంది. వారి కవితాభివ్యక్తి పై పద్యంలో రెండు లక్షణాలు ఉన్నాయి.

భారతదేశాన్ని చక్కని పాడి ఆవుతో పోల్చారు. అయితే హిందువులు లేగ దూడలన్నారు. లేగదూడను తల్లినుంచి వేరు చేసి పాలుపిండటం గొల్లవారు చేసే పనే కాని ఈ తెల్లవారు ఒఠి గొల్లవారు, వెర్రిగొల్లవారుకారు "గడుసరి గొల్లవారు" అందుకే మూతులు బిగియకట్టారు అస్వతంత్రమైన భారతదేశపు ధీనస్థితికి అక్షరరూపం ఈ పద్యం ఆనాటి రాజకీయ పరిస్థితులకి అద్దమే ఈపద్యం.

చిలకమర్తి ఈ పద్యం చదిన తర్వాత ఎందరో దాన్ని మళ్ళా మళ్ళా చదివించి విన్నారు. కొందరు కంఠోపాఠంచేశారు. కృష్ణానది వంతెన గోడలమీద పెన్సిళ్ళతో రాయబడింది పద్యం ఆనాటి గోదావరీమండల సభాపద్యాలతోబాటు హరికథలలో కెక్కింది.

1905లో బెంగాలు దేశవిభజన జరిగింది. బెంగాలీ వారికి తీరని అన్యాయం జరిగిందని వారిపై సానుభూతి చూపిస్తూ, బ్రిటిష్ ప్రభుత్వచర్యను ఖండిస్తూ దేశంలో చాలా ప్రదేశాలలో బహిరంగసభలు జరిగాయి. ఆ సందర్భంగా రాజమహేంద్రవరము వచ్చాడు. బ్రహ్మమత ప్రచారకుడైన బిపిన్‌చంద్రపాల్. రాజమహేంద్రవర టౌన్‌హాల్‌లో వరుసగా ఐదురోజులు బ్రిటిష్ ప్రభుత్వాన్ని నిరసిస్తూ ఆంగ్లంలో గంభీరోపన్యాసాలు చేశాడు. ఆ ఉపన్యాసాలు విని జనులు ఉద్రేకపూరితులయ్యారు. అయితే ఇంగ్లీషులో బిపిన్‌చంద్రపాల్‌గారి ఉపన్యాసాలు అర్థం చేసుకోటం కష్టమయిన సభ్యులు వాటిని తెలుగులో చెప్పవలసిందిగా చిలకమర్తిని కోరారు. ఆ కోరిక ననుసరించి ఆ ఉపన్యాసం చెప్తున్నప్పుడే మనసులో ధారణ చేసుకొని, ఒక్క విషయం వదలకుండా చిలకమర్తి తెలుగులో వివరించారు.

ఆ ఉపన్యాసాలు అయిపోయాక ఆఖరి రోజు చిలకమర్తి చదివిన పద్య మిది శాశ్వతంగా సాహిత్యచరిత్రలో స్థానం సంపాదించుకున్న పద్యమిది.

సీ॥ ఈగ వ్రాలినగాని వేగ జారెడునట్లు
మన్వంపు కురులను దువ్వినాడు
వరలలాటమునందు తిరు చూర్ణ రేఖను
ముద్దుగారెడుభంగి దిద్దినాడు
అరుణ పల్లవ మట్లు కరము రంజిలు చెం
గావి వస్త్రంబును గట్టినాడు
చాపలంగరఖాను జక్క ధరియించి
వలెవాటు కండువ వైచినాడు

చెవుల సందున గిరజాలు చిందులాడ
మొగము మీదను చిరునవ్వు మొలకలెత్త
టంగుటూరి ప్రకాశము రంగు మెరియు
ధవళగిరితీర్థమునకు తరలివచ్చె

చిలకమర్తి, టంగుటూరి ప్రకాశం, హనుమంతరావునాయుడు, నాటక సమాజ సభ్యులు కలసి జనార్దనస్వామి తిరునాళ్ళకు ధవళేశ్వరము వెళ్ళినప్పుడు చెప్పిన పద్యమిది.

ప్రకాశం గారి రూపం, వేషం చిలకమర్తి వారి చేతిలో తీర్చి దిద్దబడిన వర్ణచిత్రం ఇది.

ఈగ వాలితే జారిపోయేంత నున్నగా దువ్విన కురులు
నుదుట తిరుచూర్ణం
చెంగావి వస్త్రం
చారల చొక్కా (అంగరఖా)
వలె వాటుకండువా - ఇది ప్రకాశం వేషం.
గిరజాలు చెవుల సందుల చిందులాడుతున్నాయి.
చిరునవ్వు ముఖాన మొలకలెత్తింది.

ముద్దుకారడం, మొలకలేత్తటం. ఈ క్రియారూపాలు పద్యానికి సజీవత్వాన్ని ఆపాదించాయి.

చిలకమర్తి ప్రకాశం ఒకరికొకరు పరిచయమైన తర్వాత చాలా రోజులు 'ఏమండి' అనుకొనేవారు. ప్రకాశం బుద్ధి, రూపవిశేషాలు చిలకమర్తి నాకర్షిం చాయి. ప్రకాశం మెట్రిక్ పరీక్షలో కృతార్థుడైనపుడు రెండు రూపాయల చీనామి ఠాయికొని మిత్రులకు పంచిపెట్టాడు. చిలకమర్తి వారిద్దరిస్నేహము ఎక్కువై 'ఏమిరా' అనుకోటం మొదలుపెట్టారు. చిలకమర్తి వారి నాటకాలలో ప్రకాశం వేషం ధరించేవాడు. చిలకమర్తి వారి కీచకవధ నాటకంలో ప్రకాశం ద్రౌపది పాత్ర ధరించారు. (స్వీయచరిత్ర 133పులు) శ్రీరామజననాటకంలో దశరధుని పాత్ర ధరించారు. అంతేకాక కౌసల్యపాత్ర కూడా ఆయనే ధరించి అందర్నీ మెప్పించారు.

1904లో ప్రకాశం బారిష్టరు చదటానికి ఇంగ్లాండువెళ్ళి తిరిగివచ్చిన తర్వాత స్నేహితులంతా కలసి ఒక విందు ఏర్పాటు చేశారు. ఆ విందులో పాల్గొ న్నందుకు సంఘం నుంచి తీవ్రమైన విమర్శకు గురికావలసి వచ్చింది చిలకమర్తి కూడా పంక్తి భోజనం చేయబట్టి వెలివేయాలని పెద్దల పట్టుదల ఆనాడు.

ప్రకాశం గారికి చిలకమర్తి పై ఎంతో గౌరవాభిమానాలుండేవి. ప్రకాశం గారు మంత్రి అయ్యాకకూడా రాజమహేంద్రవరం వచ్చి, చిలకమర్తిని ప్రత్యే కంగా కలుసుకున్నారు. అనాటి గౌరవసభకి చిలకమర్తి అధ్యక్షత వహించారు. చిలకమర్తికి ప్రకాశానికి వున్న అనుబంధమలాటిది.

క॥ వనితల పలుకుల యందున
ననిమిష లోకమున నున్న దమృతమటంచున్
జనులను టెగాని లేదట
కనుగొన నీ యందమృతము గలదు ఫకోడీ ।

క॥ ఆ కమ్మదనము నా రుచి
యా కరకర యా ఘుమఘుమయాపొమకమలా
రాకలు పోకలు వడుపులు
నీకేదగు నెందులేవు నిజము పకోడీ ।

క॥ నీ కరకర నాదంబులు
మా కర్ణామృతములు నీదు మహితాకృతియే
మా కనుల చందమామగ
నేకొని యాడెదను సుమ్ము నిన్ను పకోడీ ।

క॥ ఆ రామానుజుడా గతి
పోరున మూర్ఛిల్ల దెచ్చె మను సంజీవిన్
మారుతి యెరుగడు గాక య
య్యారె నిను గొనిన బ్రతుకడట పకోడీ ।

క॥ హరపురుడు నిన్నుదిను నెడ
గరుగదె యొక వన్నెనలువు గళమున మరి చం
దురుడున్ దినిన కళంకము
గరుగక యున్నాళ్ళు నుండగలదె పకోడీ ।

క॥ కోడిని దినుటకు సెలవున్
వేడిరి మున్ను బ్రాహ్మణులు వేధ నంతడున్
కోడి వలదా బదులు ప
కోడిందినుమనుచు జెప్పె కూర్మి పకోడీ ।

ఇవి 'పకోడీ పద్యాలు' చిలకమర్తి హాస్యస్వభావానికి మిగిలే వేడివేడి పకోడీలు.

వనితల పలుకుల్లో. స్వర్గంలో అమృతం వుందంటే నిజమని నమ్మడట. కాని ఆది ఒఠిమాట - నిజమైన అమృతం పకోడీలలోనే వుందిట - పకోడీల కరకరలు ఘుమ ఘుమలు, రసం, రూపు, రుచి మనకి నోరూరింపక తప్పవు. కోడికి బదులుగ పకోడీ తినుమని బ్రాహ్మణులకు బ్రహ్మవర మిచ్చాడట. లక్ష్మణ స్వామి మూర్ఛిల్లినపుడు, పకోడీ సంగతి తెలియని మారుతి సంజీవినికని పరి గెత్తాడు కానీ పకోడి సంగతి తెలుస్తే అంతదూరం పోనక్కర్లేదు కదా - ఇదంతా చిలకమర్తి చమత్కారంగా, హాస్యంగా చేసిన రచన,

అయితే 'కందం చెప్పినవాడేకవి' అన్నవాకుక సార్థకం చేశారు చిలకమర్తి అందులోనూ ఆశుకవితలో కందం చెప్పటం మరోవిశేషం.

ఈనాడు కుక్కపిల్ల, అగ్గిపుల్ల, సబ్బుబిళ్ళ కవితావస్తువులైతే, ఆనాడే చిలకమర్తి చేతిలో పకోడీ కవితావస్తువైంది.

ఓ సాయంత్రం హనుమంతరావు నాయుడుగారు, ప్రకాశం, చిలకమర్తి, నాటకసభ్యులు ముచ్చట్లాడు కుంటుంటే హనుమంతరావునాయుడుగారు పకోడీలు తెచ్చిపంచారు. 'పద్యానికో పకోడీ బహుమానమిస్తాం - పకోడీపై పద్యాలు చెప్పండనికోరారు. స్నేహితులు చిలకమర్తి కవులకు అక్షర లక్షలిచ్చేకాలం గతించింది. పద్యానికి పకోడీలనిచ్చే దుర్దినాలు వచ్చాయని చిలకమర్తి సమాధానమిచ్చారు. హాస్యంగా కొద్ది నిముషాలైయ్యేసరికి, నిజంగానే కరకరమంటూ పకోడీలు చిలకమర్తి నోటివెంట పద్యరూపంగా రూపుదిద్దుకున్నాయి.

ఆశువులో కందం చెప్పి, వారి కవితా ధారను ప్రదర్శించారు, మరోసారి చిలకమర్తి,

సీ॥ ఆల బోతుల దెచ్చి యచ్చు బోసెడివారు
నిలువు దోపులనిచ్చి నిలుచువారు
డిబ్బీల యందున డబ్బు వేసెడివారు
సాష్టాంగదండముల్ సలుపు వారు
వడుగులు బెండ్లిండ్లు వరుస జేసెడివారు
చెలువుగా భజనలు చేయువారు
వేంకటేశ్వరయంచు వినుతి జేసెడివారు
తివిరి ప్రదక్షిణల్ తిరుగువారు
ముడుపుల సమర్పణము జేసి మ్రొక్కువారు
కొండపై నెక్కజాలక కుందువారు
ఈశ్వర ప్రసాదమును భక్షించువారు
కలిగి కలకలలాడె దేవళము నేడు.

చిలకమర్తికి తిరుపతిలో ఐదు రోజుల వివాహం జరిగింది. తిరుపతి క్షేత్ర వైభవం కళ్ళకు కట్టినట్టుంది-నిలువు దోపిళ్ళ నివ్వటం, డిబ్బీలలో డబ్బు వేయడం సాష్టాంగ దండప్రణామాలాచరించటం, వడుగులు పెండ్లిండ్లు చేయటం - ఆనాడే

కాదు. ఈనాటికీ ఏనాటికీ అదే తిరుపతి వైభవం - నిత్యకల్యాణం, పచ్చతోరణం ఆక్షేత్ర భాగ్యం తిరుపతిని చేరిన భక్తులు రకరకాలు - కొందరు మ్రొక్కేవారు, కొందరు కొండను ఎక్కేవారు, కొందరు స్తుతించేవారు, కొందరు కీర్తించేవారు - నవవిధభక్తి మార్గాల్లో కొన్నియివే. పోతన చెప్పిన శ్రవణమున్, దాసత్వమున్, వందనార్చనమున్, సంకీర్తనమున్ మొదలైన భక్తిమార్గాలను చిలకమర్తి సీసంలో రక్తికట్టించారు.

పురములు మంచి గ్రామములు పుణ్యనదుల్ గలుగంగ సింహ సూ
కరముఖ దుష్ట జంతువులు గల్గి భయంకర ఘోరపన్నగో
త్కర యుతమైన యీవిపుల కాననమందున నిల్వనేల నీ
చరణము లాశ్రయించు జనసంఘము కష్టము నొందదే యిలన్

మంచిగ్రామాలు పట్టణాలు, పుణ్యనదులువున్న ప్రాంతాలు వదలి భగవంతుడు ఘోరారణ్యాలలో క్రూరజంతువులున్న ప్రాంతాలలో వెలుస్తే, నీ పాదపద్మసేవచేసి సామాన్య ప్రజలకి ఎంత కష్టం అని ప్రశ్నిస్తున్నారు చిలకమర్తి. ఒక భక్తునిగా అయి భగవంతుడు ఆశ్రితవరదుడు. ఆపన్నశరణ్యుడు ఆయనె క్కడున్నా తన శిష్యుల్ని భక్తుల్ని రక్షించుకోగలశిష్టరక్షాదక్షుడు.

ప్రజల కష్టాన్ని గురించకుండా నువ్వు కొండల్లో కూర్చుంటె ఎట్లా-

వ్యాజనిందాస్తుతి యిది. నిజంగా భగవంతుడు ఘోరారణ్యాల్లో ఎందుకున్నాడు-భక్తుల హృదయ మందిరాలలోనే నివసిస్తున్నాడుగా!!

తొల్లి బీబీనాంచారియన్ తురకపడతి
పెండ్లియాడితివని బుధుల్ జెప్ప విందు
వర్ణసంకరుడగు నీకు వందనంబు
బ్రాహ్మణాదులు చేయుట పాడియగునే.

బీబీనాంచారిని వివాహమాడినందుకు వేంకటేశ్వరుడు వర్ణసంకరుడయ్యాడు అలాంటి వానికి బ్రాహ్మణాదులు వందనం ఎలాచేస్తారు-వందనం చేయమనడం న్యాయమా। నిజానికి బ్రహ్మమత సిద్ధాంతాలను విశ్వసించిన చిలకమర్తి, వీరేశలింగంగారి అనుయాయి. అయన చిలకమర్తి వర్ణాశ్రమధర్మాలను మూఢంగా

నమ్మలేదు. అయితే భగవంతుని ప్రార్థించటంలో, భక్తిమార్గంలో వ్యాజనింద మాత్రమే యిది. శతకసాహిత్యంలో వ్యాజనిందాస్తుతి శతకాలున్నాయి.

బిల్లాంగనావంత పీడితఫలభక్తి
హేయంబు దోచలేదెంత నికు-అన్న ఆంధ్రనాయక శతకకర్త నిందాస్తుతిలాటిదే చిలకమర్తి వారు వేంకటేశ్వ వర్ణసంకరుడవుగాని బ్రాహ్మణాదులువందనం చేయుట తగునా అని ప్రశ్నించారుకూడా!

చం॥ చెలగి వరాహరూపయును సింగపురూపు దార్చి తొల్లి కా
నలజరియించి యుండుట వనంబులపై నిరుప్రీతి నీమదిన్
గలుగబోలునయ్యదియే కారణమేమొ మహా వనంబులున్
మలలనుండు వాంఛ యతియుప్రతము గానుదయించియుంటకున్

చం॥ ముడుపుల నీయకున్న యతిమూర్ఖుల బెత్తము తోదగొట్టి నీ
ముడుపుల తెచ్చికొందుపని భూజనులాడెదరట్టి నీవు నీ
గుడి నడిరేయి జొచ్చి ధనకోశము ముచ్చలు దొంగవాండ్ర నీ
వడపక పోతివయ్య మహత్వమె! చెప్పుము వేంకటేశ్వరా

నరహరి రూపందాల్చిన వేంకటేశ్వరుడు కొండల్లో, అడవుల్లో వుండటానికే ఇష్టపడుతున్నాడు. అందుకే ఏడుకొండలెక్కి-కూర్చున్నాడు. గాని ముడుపులు చెల్లింపకపోతే మొట్టికాయలువేసే వసూలుచేసి వడ్డికాసులవాడు అని లోకమంతా చెప్తుంటే, తన గుడిలోనే ధనంహరించే దొంగల్ని చూస్తూవూరుకున్నాడెందుకు-అది గొప్పతనమా, చెప్పు, ప్రశ్నిస్తున్నాడు భక్తుడు చిలకమర్తి గొంతుతో. అయితే ఆ ప్రశ్నకి సమాధానం అక్కర్లేదు. చిలకమర్తికి.... అని ప్రశ్నకాదు!! భగవంతుని లీలలలో తన్మయత్వం చెందిన మానసికస్థితి మాత్రమే అది.

"అఖిలపోషకుడ వన్నాఖ్య మాత్రమే కాని, కర్తవు నీవె, భోక్తవు నీవె" ఇదే తత్త్వం ఇక్కడ.

ఒక్క విశేషం-పిండారిదండ్లు, మొదలైన దండ్లు. ఆ రోజుల్లో దేవాలయాల్లోని ధనాన్ని సొమ్ముల్ని హరించడం, దానికై భక్తులు మొరపెట్టుకోటం, ఏదో విధంగా తిరిగి ఆ ధనం దేవుడికి చేరడం-ఇలాంటి సంఘటనలు చాలా ఎక్కువగా కనిపిస్తాయి ఆనాడు మనకు....

వివాహ సందర్భంగా తిరుపతి క్షేత్రవైభవాన్ని గురించి చెప్పిన చిలకమర్తి పద్యాల్లో భక్తిభావం ముప్పేటలుగా ముడిపడివుంచిది,

సీ॥ తుహినాద్రి మొదలు సేతువు దాక రాజ్యంబు
జరపె నీ యాంగ్లేయ దొరతనం బె
జాతిమతాచార సర్వస్వతంత్రముల్
నెరిపె నీ యాంగ్లేయ దొరతనం బె
పిండారి దండుల పేరైన లేకుండ
దోలె నీ యాంగ్లేయ దొరతనంబె
నేర్పుతో చట్టముల్ నిర్మించి క్లేశమున్
తొలిచె నీ యాంగ్లేయ దొరతనం బె
ప్రజలు లోపముల్ జూప నాగ్రహము లేక
కరుణజూపు నీ యాంగ్లేయ దొరతనం బేలుగాక
ఇట్టియాంగ్లేయ దొరతనం బేలుగాక
ధర్మమతితోడ నా చంద్రతారకంబు ।

1895 లో కాకినాడలో జరిగిన గోదావరి మండల మహాసభలో చిలకమర్తి చదివిన పద్యమిది. అప్పటికి చిలకమర్తికి రాజకీయాలలో బాగా ప్రవేశము లేదు. మూడవ రోజు సభలో చిలకమర్తి పద్యాలు చదివారు. ప్రతిపద్యానికి చప్పట్లు చరిచారు సభ్యులు. ఆపద్యాలు గోదావరి మండలమంతా వ్యాపించాయి. ఎవరికవిత్వాన్ని మెచ్చని వీరేశలింగంపంతులుగారు ఈ పద్యాలు బాగున్నాయని మెచ్చుకున్నారు (210 - స్వీ చ)

ఈ పద్యం వింటుంటే కాస్త ఆశ్చర్యమేస్తుంది - దేశభక్తుడు చిలకమర్తి ఆంగ్లేయ దొరతనం "ఆచంద్ర తారార్కంగా వుండాలని ఆశించడం ఎలాసాధ్యం''

ఈ పద్యంలో 'తుహినాద్రిమొదలు సేతువుదాక అని పై నుంచి కిందికి వరస చెప్పటం చమత్కారం సాధారణంగా 'ఆసేతు హిమాచలం' అన్నది లోకంలో వున్న వాడుక. నేర్పుతో చట్టాలునిర్మించి, ప్రజల కష్టాలతొలగించి పిడారి దండులను తోలేసిన ఆంగ్లేయదొరలపై ఆగ్రహం దేనికి ప్రజలకి అనిపిస్తుంది ఒక్క నిముషం అంతే వెంటనే చిలకమర్తి మరోపద్యం చదివారు, అది నిష్పక్షపాతమైన పద్యం - ఆంగ్లేయ దొరతనం గొప్పదే - కానీ,

సీ॥ దీప్తిమంతంబైన దీపంబుతోడ గ్రిం
నీడ యొక్కింత గన్పించునట్లు

కమ్మకమ్మని తావి గుమ్మున వెదజల్లు
గుల్లగులాబికి ముండ్లు అంటినట్లు

సర్వజనానంద సంధానకరుడైన
చంద్రమామను గందు జెందినట్లు

జీవనాధారమై జెలగు చల్లని వాని
బెడిదంబు పిడుగుల నదరినట్లు

ఉత్తమం బగునట్టి యీ హూణరాజ్య
మందు గనుపించు లోపంబు లరసి జూడ
తన్నివారణార్థంబుగాదె ధన్యులార
గౌతమీ మండల సభ సంకల్పమయ్యె -

అసలు రహస్యం బయలపెట్టాడు చిలకమర్తి ఈ గౌతమీ మండల సభలు దేనికి - ఆంగ్లప్రభుత్వ పరిపాలనా లోపాలను పర్యవేక్షించి, తగిన చర్యతీసు కొందుకు ఏర్పాటు చేయబడ్డాయి. ఆసభలో చిలకమర్తి దొరతనాన్ని పొగిడాడు మొదట కాని వెంటనే లోపాన్ని చూపాడు ఇది చిలకమర్తి వ్యక్తిత్వంలోని విశేషం. నిష్ఠురంగా అనేయడు. నెమ్మదిగా చెప్పాలనుకున్నది. చెప్తాడు.

దీపం కిందనీడ
గులాబికి ముళ్ళు
చందమమాకి మచ్చ
చల్లని వానకి పిడుగు

అయితే ఈ ఉపమానాలు మాత్రం దొరతనానికి తగినవా అన్నది ప్రశ్న ఈ సీస పద్యరచనలోనే చిలకమర్తి చమత్కారాన్ని చూపగలరు. మొదటి పద్యంలో దొర తనాన్ని కీర్తించి, ఆ చంద్రతారార్కం నిలవాలని ఆశీర్వదించటం రెండో పద్యం లో దొరతనంలో లోపాన్ని చూపి, సద్దుకొండని హెచ్చరించడం - ఇంక మూడో పద్యంలో గౌతమీ మండలసభ "అఖిలజనసౌఖ్యదాయకమగుచు నిదియే

ధరణివర్ధిల్లు నా చంద్రతారకంబు'' అన్నారు. ఆ తర్వాత పద్యాలలో చిలకమర్తి విజృంభిచారు. దొరతనం చేస్తున్న అన్యాయాలను నిరాఘాటంగా నిస్సంశయంగా చాటి చెప్పారు.

సీ॥ నేల దున్నుదమన్న జాలతరము పన్ను
నీరుగావలెనన్న నీటిపన్ను
వాణిజ్య మొనరింత వచ్చుబడికి పన్ను
సరకు లమ్ముదమన్న సంతపన్ను
కఱ్ఱ లమ్ముదమన్న గలప కింకొక పన్ను
పట్టణమ్ముల మున్సిపాలు పన్ను
పారి పోవుదమన్న బండి హాసీల్ పన్ను
కొంపయు కొన్నచో స్టాంపు పన్ను
ఉన్నమట్టుగ తినకుండ ఉప్పుపన్ను
ననెడు పన్నులె దిగదీసె జనులనెల్ల
కట కటా యెట్టులున్నదో కాపులదశ
సుగుణ ధనులార జనులార చూడరయ్య

సీ॥ అధికార భూతంబు లడుగు లంచము లిచ్చి
పరిపరి విధము తె' పన్నులిచ్చి
మనసబు కరణాల ముడుపు లన్నియు నిచ్చి
కోసి నూర్చిన వారి కూలినిచ్చి
కచ్చేరి బంట్రోతు గములకీనా మిచ్చి
పాలేళ్ళకును కొంత పంటనిచ్చి
యజమానునకు బంట నర్థ భాగంబిచ్చి
పైకమిచ్చిన వాని వడ్డినిచ్చి
తే॥ గడ్డిమాత్రమే మిగిలించు గావువాడు
సేద్యమునదాను బసువులు భక్షించుకొరకు
కటకటా ఎట్టులున్నదో కాపుల దశ
సుగుణధనులార జనులార చూడరయ్య.

ఈ పద్యాలు వింటుంటే అవి చిలకమర్తి కేవలం గోదావరీ మండల సభ లలో చెప్పినవి మాత్రామే కానిపిస్తుంది. అవి ఆనాటి రాజకీయ సాంఘిక స్థితి గతులను అద్దంపట్టి చూపిస్తున్నాయి. ఎన్నిరకాల పన్నులు - ఆ పన్నుల వ్యథ నుండి తప్పించుకొనిలేని ప్రజలు ఆ పన్న శరణ్యుని చేరవలసిందే! పైగా ఈ సీసపద్యాలలో ఆనాటి చారిత్రక సంఘటనలు వివరిచటంమౌతోంది-ఉప్పు పన్ను- అదే ఉప్పు సత్యాగ్రహానికి దారితీసింది-దేశమంతా ఉప్పుసత్యాగ్రహమ హోద్యమంలో ముందుకు నడిచింది గాంధీ మార్గాన--

అధికార భృతాలు. అడిగే లంచం-

మునసబు కరణాల ముడుపులు-

యజమానులకు పంటలో అర్థభాగం-

పైక మిచ్చిన వానికి వడ్డీలు-

ఇన్నీ ఇచ్చుకునే కాపుకి మిగిలిందేమిటి-పశువులతో పాట భక్షించడానికి గడ్డి. కాపులదీనస్థితి, దొరతనం వారి అరాచకత్వం-రెండూ ఒకే పద్యంలో కళ్ళకు కట్టించారు చిలకమర్తి. ఈ పద్యాలు ఒక రకంగా కరుణరసోపేతమైన కావ్యంలాటివి.

ఈ సభలు ఏర్పాటు చేసింది న్యాపతి సుబ్బారావు పంతులుగారు. ఆయన అధ్యక్షత వహించిన ఈ సభలు స్నేహితుల అండదండలతో, కార్యదక్షతతో విజయవంతమయ్యాయి. ఈసభలకి చరిత్రలో చాలా ప్రముఖ స్థానముంది. ఆనాటి రాజకీయ వేత్తలు, సంఘ సంస్కర్తలు, సాహిత్యాభి లాషులు ఎందరో ఈ సభల్లో పాల్గొన్నారు.

సభలయిన రాత్రి భోజన సమయంలో ఈ పద్యాలను, న్యాపతి సుబ్బా గారు కృత్తివెంట పేర్రాజుగారు, గంజాము వెంకటరత్నంగారు, బాదం వెంకట రత్నంగారు మొదలైన పెద్దలు చిలకమర్తి చేత మళ్ళా మళ్ళాచదివించుకున్నారు. కాకినాడ నుంచి చిలకమర్తి బయలు దేరి వెళ్తుంటె, ఆ వీధుల్లొ జనులు "వీరె నిన్న పద్యములు చదివినవార" ని వ్రేలితో చూపించి ఒకరితో ఒకరు చెప్పుకొన్నారు. మరో విశేషం ఆ పద్యాలు హరికథల్లో హరిదాసులు వాడటం మొదలు పెట్టారు. చిలక మర్తి వారి స్నేహితుడు పిళ్ళారిసెట్టి నారాయణరావునాయుడుగారు చిలకమర్తిని అభినందిస్తూ, ఇలాంటి పద్యాలు దొరతనం వారిని మెచ్చుకుంటూ చెప్తే, మీకు రావు

బహద్దర్ బిరుదము తప్పక ఇస్తారు. అన్నారు. ఇంకో ప్రత్యేకత - ఈ పద్యాలు మనోహరంగా వుండబట్టి న్యాపతి సుబ్బారావుగారు ఆ పద్యాలను విజయనగరం రండి, అక్కడ కళాశాలలో ఆంగ్లోపన్యాసకులగా పనిచేస్తున్న గురజాడ అప్పారావు గారి చేత ఇంగ్లీషు పద్యాలుగా రాయించారు తర్వాత తెలుగు పద్యాలు, ఇంగ్లీషు పద్యాలు కూడా గౌతమీ మండల సభావృత్తాంతాన్ని తెలియజేసే రిపోర్టులో అచ్చువేయబడ్డాయి.

చిలకమర్తి వారి తండ్రి ఈ పద్యాలు చదివి ఆనందించడమే కాక, ఇరుగు పొరుగు కాపువారిని పిలిచి ఇంట్లో కూర్చోపెట్టి, ఇవి చదివి వినిపించారు వారికి.

ఇంతటి ప్రచారాన్ని, ఆదరాన్ని పొందిన గౌతమీ మండల సభా పద్యాల ప్రత్యేకత ఏమిటి - చిలకమర్తి వారి పద్యశిల్పం ! - ముఖ్యంగా సీస పద్య రచన - అంతే కాకుండా ఆ పద్యభావంలో ఒక అప్యాయత, ఒక స్నేహభావం వుండటం గమనించదగింది. ఆంగ్లేయ దొరతనంలో వున్న గొప్పతనాన్ని అంగీకరించినా, దోషాలు చెప్పటంలో వహించిన నిష్పక్షపాతవైఖరి - ఒకవంక దేశభక్తి - మరోవంక బీద ప్రజల దీనస్థితి పై జాలి, చిలకమర్తి వ్యక్తిత్వానికి గీటురాళ్ళు ఈ పద్యాలు.

పైగా మొదటి పద్యంలో తుహినాద్రి మొదలు :.... అని మొదలు పెట్టి నాల్గుపాదాలలోనూ 'ఈదొరతనంబె' అని మెచ్చించి చెప్పడం - వేలుపెట్టి చూపినట్లు - మరోపద్యంలో నాల్గు పాదాలలోను రాజభక్తి యొకటి, దేశాభిమానమొకటి, జాలి యొకటి, విధియు యొకటి - అంటూ ఒకటి ఒకటి అంటూనే నాల్గు విషయాలు చెప్పి పాఠకుల్ని ఆకట్టుకోటము, ఆనాటి సభాసదుల్ని మంత్రముగ్ధుల్ని చేసినట్టు కదలకుండా చేయటము చిలకమర్తి వారి పద్యరచనా రహస్యాలలో ఒకటి - చివర్లో.

గౌతమీ మండల సభకు ఖ్యాతి మెరయ
పూర్ణ భక్తి సమర్పించె పుష్పమాల
వసుధ వీరవాసరపుర వాసియైన
చిలకమర్తి లక్ష్మీనరసింహ మూర్తి" అన్నారు.

ఇది ఒకరకంగా నాటకభరత వాక్యం లాంటిది. పద్యపుష్పమాలలు సమర్పించి గోదావరీ మండలంలోనే ఖ్యాతిగాంచారు చిలకమర్తి.

సీ॥ ఏ మహాదేవి మహీపాలనమ్ముమాట
ప్రసుక్కడు ప్రజకెల్ల జోలపాట
యే జగద్వందిత యేల్బడి మనకెల్ల
చిరత నానందంపు జిత్తజల్లు
బహుపుత్ర పౌత్ర లాభస్ఫూర్తి గన్న, యే
గరికమిన్న కడుపు గందపెరడు
కుటిలమత్తారాతి కోటికే సతి జయ
భేరీభాంకరణంబు పిల్లపిడుగు
యే నృపార్చిత విజయలక్ష్మి నటన క
ఖండభరత ఖండంబు రంగస్థలంబు
అమరు నా చాన విక్టోరియాభిధాన
శ్రీమహిత నిత్యకల్యాణి సీమరాణి

1897 విక్టోరియారాణి వజ్రోత్సవం జరిగింది. అరవై సంవత్సరాలు సామ్రాజ్యపాలన చేసిన సందర్భంలో జరిగిన మహోత్సవమది. రాజమహేంద్రవరంలో కూడా గొప్పసభ జరిగింది. దానికి ఆనాటి గోదావరి జిల్లా కలెక్టరు బ్రాడిదోరగారు అధ్యక్షతవహించారు. వీరేశలింగంగారు మొదలైన వారు ప్రసంగించారు. చిలకమర్తి పద్మాలుగు సీసపద్యాలు చదివారు. సీసపద్యరచనలో సిద్ధహస్తులే కదా చిలకమర్తి. పైగా పాదాలచివర,

జోలపాట
చిత్తజల్లు
కందపెరడు
పిల్లపిడుగు-ఈ పదప్రయోగంలో

ఒక విశేషం-జోలపాట మనసుకి హాయిని కలిగిస్తుంది

చిత్తజిల్లులా శరీరానికి హాయిని కలిగిస్తుంది

కందపెరడు-మరీ బాగుంది ప్రయోగం. సాధారణంగా పెరటి దోడ్లో వేసేవి వంటకు ఉపయేగించే ఆకుకూరలు, పాదులు అయివుంటాయి. ఇక్కడ అన్నపదం-వంశాభివృద్ధి సూచన.

బహుళ పుత్ర పౌత్ర స్ఫూర్తికన్న గరిత మిన్న కడుపు కందపెరడు. అన్నారు చిలకమర్తి.

'దుంప పిలకలెత్తడం' అనే వాడుకవుంది - వంశాభివృద్ధి కలగటం అనే అర్థంలోనే - పైగా తెలుగువారి ఆచారంలో కందమొక్కకి పూజచేయటం, పిల్లలు లేని వాళ్ళు ముఖ్యంగా కందమొక్కని పూజించటంకూడా వుంది ఈ అర్థంలోనే అందంగా ప్రయోగించారు చిలకమర్తి 'కందపెరడు' అని.

విజయలక్ష్మి నటనకు అఖండ భరత ఖండంబు రంగస్థలంబు - అనటం మరో విశేషం. విక్టోరియారాణి విజయవంతంగా అరవైయేళ్ళు రాజ్యపాలన చేసిందని చెప్తూ నటన, రంగస్థలం అనే పదాలు వాడటం చిలకమర్తి జీవితంలో పెనవేసుకున్నవే.

ఏ' అంటూ నాలుగు పాదాలు ఎత్తుకొని సీసాన్ని నిర్వహించటంలో, ఆ పద్యం నడకలో ఒక ప్రత్యేకతని సాధించారు చిలకమర్తి.

సీ॥ "ప్రిన్సాఫ్‌వేల్స్"ను పిలిచెలశారదు చంద్రు
గడువు చల్లగ మున్నుగాంచెనెద్ది
విపులశాఖల నొప్పు విమల సంతాన
కల్పమహీజము కాలవాలమెద్ది
విబుధ కోటిని బ్రోచు విశ్రుత కృపయను
నమృతంబు పుట్టి నిల్లయ్యెనెద్ది
విమతక్షమాపాల వితతిగాల్చెడు కోప
బడబాగ్ని శిఖల కావాస మెద్ది
ధవళ శారీర రుచులతో దనరునెద్ది
యన్మహా విష్ణు విడిది నిల్లయ్యెనెద్ది
అట్టి విక్టోరియారాజ్ఞియనెడు నిండు
పాలకడలి మమ్మెలార్చి యేలుగాత!

సాహిత్య సంప్రదాయంలోవున్న "వంశాభిచంద్రుడే" ఈ ప్రిన్స్ ఆఫ్ వేల్స్ - వేల్స్ యువరాజు!-

అమృతమునకు పుట్టినిల్లు
కల్పమహీజము,
బడబాగ్ని శిఖలు,
మహా విష్ణువు విడిదియిల్లు,
పాల కడలి -

విక్టోరియారాణియే పాలకడని - ఆమె "ధరళశరీరరులతో" ఒప్ప తోంది మరి-సంప్రదాయసిద్ధమైన పదఖంటన మైగా పాలకడలిలోనుంచే అమృతం పుట్టింది. కల్పమహీజంపుట్టింది. చంద్రుడుపుట్టాడు. అతిశయోక్తిలో రక్తికట్టించారు ఇక్కడ చిలకమర్తి.

ఎద్దీ, ఎద్దీ అని అంటూనే - అది అని చివర్లో చెప్పటం రచనా రహస్యం.

పద్య నడకకి అనువైన విధం యిది. చిలకమర్తి వారి ఆశీఃపద్యమిది.

సీ॥ కలియుగంబున నిట్టి ఘనతలో నెనుబది
వత్సరంబులదాక బ్రతుకుటరిది
బ్రతుక బోలును గాని రాజ్యభారమునందె
షష్టిహాయన పూర్తి జరుపుటరిది.
జరుపనోప్పునుగాని జనసమ్మతంబైన
యుత్తమ పాలన మొంటుటరిది.
యుండవచ్చును గాని సిందువేడుక తోడ
సిరియు సంతతి యిట్లు చేరుటరిది
యరుదులన్నియు నీయందె య మరియుంట
బ్రతుకు వేయేండ్లు శాశ్వతైశ్వర్య వృద్ధి
నేలువేయేండ్లు మా దేశమిట్లె నీవు
గుణమణి కదంబ ధన్య విక్టోరియాంబ

ఈ పద్యరచనలో విశేషం ముక్తపదగ్రస్తం.

బ్రతుకు టరిది - బ్రతుకబోయిన గాని
జరుగు టరిది - జరుపనోపును గాని

శ్రుతి సుభగత్వానికిది నిదర్శనం.

జంధ్యాల వారి కుంతీకుమారి పద్య రచనలో కూడ ముక్త పద గ్రస్తం చాలా మనోహరంగాఉంది - ఆపద్యాన్ని తలపిస్తోంది ఇక్కడ -

ముని మంత్రం బోసంగనేల,
ఒసంగెను పో ఘున్మందు మార్తాండ మండలు రమ్మని కొరగనేల,

కోలిని పో ఆతండు రానేల,

వచ్చెను పో - - - - - - ఈ రకమైన నడక పద్యానికి అందాన్ని చేకూరుస్తుంది - చిలకమర్తి పండితుని ఆశీస్సు ఇది - వేయేండ్లు ఐశ్వర్యాభివృద్ధితో బతికి, వేయ్యేళ్ళూ ఏలుకొమ్మనటం - ధన్యురాలు విక్టోరియా మహారాణి !

మూడు పూటల ఢిల్లి పురికైన జనవచ్చు
గంగ దాటగవచ్చు గాలినడక
వాన కురియకున్నా పైరు చేయగవచ్చు
గడివు లక్ష్యములేక గడుపవచ్చు
గాశీ కాపుర వార్త గడియలో వినవచ్చు
రైతు రాజు నెరిద్చి బతుకవచ్చు
గడమాల పండితాగ్రిణి యైన కావచ్చు
నడవి నొంటరిగ స్త్రీ యరుగవచ్చు

దేవి పొగబండ్ల వల్ల వంతెనల వల్ల
గాలువలవల్ల నీమహా కరుణవల్ల
తంతి వార్తల వల్లను సమత్వంబు వల్ల
పాఠశాలల వల్ల నీ పనుపువల్ల.

ఈ పద్యంలో పాశ్చాత్య నాగరికతా ప్రభావం చిలకమర్తికి ఎంతగా అనుకూల మైందో తెలుస్తుంది. రైళ్ళు వార్తాపత్రికలు, టెలిగ్రాములు, పాఠశాలలు, రేడియోలు - ఎన్నెనో - దేశ ఆధునికతకు మూలాధారాలు - ప్రభుత్వంలో లోపాలను చెప్తూనే, ప్రభుత్వంలో ఉన్న మేలును మెచ్చుకోడం చిలకమర్తి సంస్కారానికి గుర్తు.

సీ॥ కృపజూపి నిరుపేద కుపకార మొనరించు
చుట్టమేదన నిన్నె చూపవలయు
బనచెడ్డపగతు చేపట్టి కాచెడి దయా
సింధువేదన నిన్నె చెప్పవలయు
బక్షపాతము లేక ప్రజలనేలు సతీమ
తల్లి యేదన నిన్నె దలుపవలయు
అఖిల విద్యలయందు నెరజాణయగు కల్కి
మిన్న యేదన నిన్నె ఎన్నవలయు
వరపతివ్రతాతిలక మెగరితమిన్న
యనిన వెంటనె నిన్నె బేర్కొనగవలయు
రాణివన నీవె జన బహిః ప్రాణమీవె
శ్రీమహిత నిత్యకల్యాణి సీమరాణి.

ఇక్కడ, నిన్నే చూపవలయు, నిన్నే చెప్పవలయు, నిన్నే దలుపవలయు, ఎన్నవలయు అంటూ చెప్పటంలోను, "నిన్నె" అని రాణినే ఎదురుగా చూపు తున్నట్లు ఉపన్యాసధోరణిలో సాగిందీ సీసపద్యం. అన్నిట విక్టోరియా రాణి ప్రత్యేకతని వక్కాణించటమిది.

సీ॥ రామచంద్రుడు మహారాజయ్యెనేగాని
చక్రవర్తి సమాఖ్య జరుగదయ్యె
నల యుధిష్ఠిరుడు రాజాధిరాజగుగాని
సార్వభౌమత్వ మొంద జాలడయ్యె
చక్రవర్తి హరిశ్చంద్రుడుండెనేగాని
యతనికి నీ భోగమబ్బదయ్యె
నలుడు భూవలయంబు గెలిచి యేలెనుగాని
యొక్క సామంతున కొరిగియుండె
మహిత గుణజాల యింక మాటలు వేయునేల
భరతఖండంబునేలిన ప్రభువులందు
నీకు నుపమింపదగినట్టి నృపుడులేడు
గుణమణి కదంబ ధన్య విక్టోరియాంబ.

ఇక్కడ చిలకమర్తి, హిందూదేశపాలన చేసిన వారిలో పేరుపొందిన రామచంద్రుడు, యుధిష్ఠిరుడు, హరిశ్చంద్రుడు, నలుడు కూడా విక్టోరియాపాలన ముందు సరితూగరని ఏదో ఒక తక్కువతనాన్ని చూపటం వజ్రోత్సవ సందర్భంగా ఆమె పరిపాలనను మెచ్చుకోటమే. అతిశయోక్తిని వినయంగా చెప్తారనిపిస్తుంది సభాంతమున చిలకమర్తి.

ప్రేమ జ్యూబిలిరీడింగు రూము పక్ష
మున రచించి యర్పించె నీపుష్పమాల
ప్రబల విక్టోరియా చక్రవర్తి నికిని
చిలకమర్తి లక్ష్మీనరసింహ మూర్తి

Jubilee Reading Room—మొత్తమంతా తేటగీతి ఛందంలో తెలుగులో సరిపెట్టేయటం విశేషం--

ఆ సభముగిసిన తర్వాత ఎదురుగావున్న స్థలంలో బాణసంచా కాల్చారు. చిలకమర్తి పద్యాలు చింతామణి పత్రికలో ప్రచురింపబడ్డాయి. ఆ పద్యాలను మెచ్చుకుంటూ ఆంధ్రదేశం నలుమూలలనుంచి చిలకమర్తికి లేఖలు వచ్చాయి.

అన్యభాషాపదాలు సహజంగా అతుక్కుపోవటం పద్యరచనలోని విశేషం. అందం.

మ॥ చెరసాలల్ పృథు చంద్రశాలలె యగున్ చేదోయి గీలించు న
యృరదండల్ విరిదండలయ్యెడును హేయంబైన చోడంబలే
పరమాన్నంబగు మోటకంబళులు దాల్పన్ పట్టు సెల్లాలగున్
స్థిరుడై యే నరుడాత్మ దేశమును భక్తింగొల్చునవ్వానికిన్'' -

తే॥ భరత ఖండంబె యొక గొప్ప బందెఖాన
అందులో నున్న ఖయిదీలు హిందు జనులు
ఒక్క గదినుండి మార్చి వేరొక్కగదిని
బెట్టుటేగాక చెరయంచు వేరెగలదె

లాలాలజపతిరాయ్‌ని మాండలే చెరసాలకు కొనిపోయింది ప్రభుత్వం. ఆ సేతు హిమాచలం వరకు గొప్ప సంచలనం ప్రారంభమయింది. ఎన్నో సభలు, సమావేశాలు జరిగాయి.

చిలకమర్తి చెప్పిన పద్యంలో దేశభక్తుని కర్తవ్య ప్రబోధవుంది. దేశభక్తుడు కష్టసుఖాల్ని లెక్కించకూడదు. అతని ధ్యేయం దేశ స్వాతంత్ర్య సముపార్జనమే. అందుకే చెరసాల చంద్రశాలగా భావించాలి. చేతికి వేసిన సంకెళ్ళు పూల దండలుకావాలి జైల్లో పెట్టే అంబలి పరమాన్నం కావాలి. మోట కంబళ్ళే పట్టు శాలువలు కావాలి - అప్పుడే దేశభక్తుడు నిలబడి కష్టానికోర్చి స్వాతంత్ర్యం తేగల దక్షుడౌతాడు - ఇదే చిలకమర్తి సందేశం -

బ్రిటిష్ పరిపాలనలో మొత్తం భారతదేశమే బందిఖాన హిందువు లందరు ఖైదీలు -

"దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్'' అనే జాతీయ తత్త్వం మరోరకంగా చిలకమర్తి ప్రబోధిస్తున్నట్లు - అలనాడు భర్తృహరి సుభాషితం ఇక్కడస్మరణ కొస్తుంది

ఒకచో నేలను పవ్వళించు, నొకచో నొప్పారు బూసెజ్జపై
నొకచో శాకములారగించు ఒక్కొకతరిన్ శాల్యోదనం - - -

కార్య సాధకుడు కష్ట సుఖాలను లెక్కింపడు - చిలకమర్తి సందేశమదే- దేశస్వాతంత్ర్యం కోసం పోరాడేప్పుడు మాండలే చెరసాలేమిటి, మరొక టేమిటి - భారతదేశమే ఒక బందిఖానా అన్నారు - వెన్ను తట్టి విజయసాధనకు ముందుకు పంపిస్తున్నట్లుందీ పద్యం.

శా॥ ఎంతోశాంతము బూడిదయ్యె చదువెంతో నేలపాలనయ్యె నెం
తెంతో మంచి తనంబు దగ్ధమయిపోయెం జెల్లెనెంతో గుణం
బెంతో ఈశ్వరభక్తి బొగ్గులయి పోయెం నాడు నీతో శ్మశా
నాంతర్భూముల నెంతనష్టమిది బాపయ్యా! సుబ్రహ్మణ్యమా!

శా॥ నీ సౌజన్యము జూచి నీదు వయసున్నీనీమముం జూచియున్
నీ సామర్థ్యము జూచి దేహగతమౌ నీ రోగముంజూచి హా
యీసన్మార్గుడు మాకు దక్కడని నాడే వేడు కొన్నారుగా
మా సన్మిత్రులు దేశభాజు పెదబాపయ్యా! సుబ్రహ్మణ్యమా!

మ॥ మదికి న్నచ్చిన యట్టిధర్మమును నమ్మన్నమ్మ దానిన్ మహా
పద ప్రాప్తించిన నాచరింపను మనో వాక్కాయ కర్మంబులం
బెది సత్యంబగు దానినే నెరప నీకే చెల్లునయ్యా గుణా
న్వద! సద్వర్తన దేశరాజు పెదబాపయ్యా! సుహృద్రత్నమా

1908లో దేశరాజు పెదబాపయ్యగారు మృతిచెందారు. ఎందరో దుఃఖించారు. ఆంధ్రబ్రహ్మసంఘమునకు, సంఘసంస్కరణకు తీరనిలోటు వాటిల్లింది. బాపయ్యగారి చిత్రపటాన్ని టౌన్‌హాలులో ఆవిష్కరించాలనుకున్నారు వీరేశలింగముగారు చిలకమర్తిని చేయమన్నారా పని మిత్రులెందరో బాపయ్యగారి గుణగణాలు పొగిడారు. ఆ సభలో చిలకమర్తివారు స్నేహితుని మరణం పట్ల సంతాపం ప్రకటిస్తూ కొన్ని పద్యాలు చదివారు. ఈతని మరణంతో ఎంతో శాంతము, ఎంతోవిద్య, ఎంతో మంచితనము. బూడిద పాలయ్యా యనటం సమయోచితంగాఉంది భగవంతుడు మంచి వారినే ఎన్నుకున్నట్లుగా సహృదయుడు,సజ్జనుడైన బాపయ్య మరణించడం జరిగిందన్నారు చిలకమర్తి. ఈ పద్యాలలో వారి ఆవేదన ప్రకటిత మౌతోంది.

క॥ తనదేహము తనగేహము
తన కాలము తన ధనమ్ము తన విద్య జగ
జ్జనులకు వినియోగించిన
ఘనుడీ వీరేశలింగ కవిజనులారా!

1919లో వీరేశలింగంగారు మరణించినపుడు చిలకమర్తి చెప్పిన పద్యమిది. ఈ పద్యం సార్థకమైనది. ఇది వీరేశలింగంగారి హితకారిణీ పాఠశాలలో రాతిఫలకంపై శాశ్వతంగా నిలిచిపోయింది. అశేష ఆంధ్రప్రజానీక హృదయాల్లో చోటు చేసుకొన్న గొప్పవ్యక్తి, మనీషి కందుకూరి. ఆయన మరణం చిలకమర్తిని చాలా కలచివేసింది.

వీరేశలింగంగారి అనుయాయిగా, ఆయన చేపట్టిన కార్యక్రమాలన్నిటినీ కొనసాగించిన ఆదర్శప్రాయుడైన శిష్యుడు చిలకమర్తి. అలనాడు అర్జునుడు కృష్ణుని నిర్యాణాన్ని భరించలేనట్లే చిలకమర్తి వీరేశలింగంగారి మరణాన్ని భరించలేకపోయారు

పోతన్న చెప్పిన "మన సారధి మన సచివుడు మన నెయ్యము" అన్న రీతిలోనే ఉంది ఇది.

తన శరీరాన్ని, శరీరాన్నేకాదు ఇంటిని, ఇంటినేకాదు కాలాన్ని, కాలాన్నే కాదు, జీవితాన్ని, జీవితాన్నేకాదు విద్యని-అన్నింటిని లోకం కోసం వినియోగించిన వాడు కందుకూరి చిన్నకందపద్యంలో ఎన్నెన్నో అనుబంధాల్ని పోగుచేసి సీలన్ సీల అమర్చినట్లొసగితో "శ్రీకాళహస్తీశ్వరా" అన్నట్లుంది ఈ చిన్న కందం--చిలకమర్తి వారి కన్నీటిపొరలు దాగివునాయి యిందులో.

కావు కావంచు మనుజుండు
వేకువను వేడు కొనకుంట విస్మయంబు
క్షుద్రజంతువు కాకియు నిద్రలేచి
కావు కావంచు నఱచునుగాదె మొదట

చిలకమర్తి వారి 'గీతమంజరి'లో పద్యమిది. ప్రాతఃకాలంలో బాలురు భగవంతుని ధ్యానించాలని ప్రబోధించే ఘట్టంలో చిలకమర్తి వారి ప్రబోధం ఎంత సరళ సుందరంగా సులభ గ్రాహ్యంగా సాగిందో తెలియటానికి ఈ పద్యం సాక్ష్యం.

దృష్టాంతం శక్తిమంతంగా వుండటమే కాకుండా, పద్యనిర్మాణంలో మొదటి చివర చరణాల ఎత్తుగడ సమానాంతరంగా వుండటము బోధకు చక్కగా ఉపయోగపడే రచనా రహస్యం, ఉక్తి పునరుక్తంలో ఊనిక కల్గించి వక్తవ్యాంశాన్ని శ్రోత చిత్తానికి హత్తుకొనేటట్లు చేసే రచనా శిల్పం. గీత పద్యం బాలుర హృదయాలకు అనువుగా హత్తుకునే ఛందం, అదే అందులోని ఔచిత్యం.

కాకిని చూడని పిల్లలుండరు. పైగా కాకమ్మకథలు, కాకిబావపాట తెలుగు పిల్లలకి తెలియనివి కావు కాకి కావు, కావు మంటుంది మనిషి కావు. కావు మనాలి. అనడేం మరి? అది చిలకమర్తి ఆర్తి. కావు-కావు-రక్షింపుము అనే అర్థాన్ని ఛందంలో నిలుపుకోటం చిలకమర్తి రచనా చమత్కారం.

శతకాలలో నీతి శతకాలకు ఒక ముఖ్య ప్రయోజనముంది. వాటి ముఖ్య ప్రయోజనమైన నీతి బోధ మిత్రసమ్మితంగాసాగాలి. నీతిశతకాలు బాలురకు, ప్రౌఢులకు, వృద్ధులకు బోధించవచ్చు. వారివారి వయఃపరిపాకాలను బట్టి అంత ధాలుండటం సహజమే. మహాపదార్థాన్ని సైతం పండొలిచి చేతిలో పెట్టినట్టు చెప్పే

బాగా పొసుగుతుంది బాలురకు. అధిక్షేపరూపంగాను వక్రోక్తి మార్గంగానూ పెద్దలకు చెప్తే మనసు నాకర్షిస్తుంది. చిలకమర్తి విధానాలు తెలిసిన వారవటంవల్ల గీతమంజరి బాలుర కోసం ఉద్దేశించారు. గీతమంజరిలో తేటగీతిలో చెప్పిన విషయాన్నే 'కృపాంభోనిధి' శతకంలో శార్దూలవిక్రీడితంలో చెప్పారు. ఇదే వస్తువు. అయినా చెప్పేక్రమంలో సొత్తు వ్యతిరిక్తమైన పద్ధతి కనబడుతుంది. ముందు దృష్టాంతం, ఆ తర్వాత వక్తవ్యాంశం.

శా॥ ప్రాతఃకాలమునందు మేలుకొని క్షుద్రప్రాణియో గాకియుం
బ్రీతిన్వేడును గావు కావుమనుచున్ నిన్నత్తిగొంతెత్తి యే
రీతిన్ జ్ఞానసమేతుడామనుజు డర్థిన్ గావుగావంచు నిన్
జేతుల్మోడిచి వేడకుండ వెలుగున్ దేవా ! కృపాంభోనిధీ.

ఈ శతకం ప్రౌఢ మనఃప్రవృత్తుల కుద్దేశింపబడింది. గీతమంజరిలో లాగ నీతిబోధలు పనిచేయవు. లోకవృత్తాన్ని ప్రౌఢోక్తి మయం చేసి ముందు చెప్పి, అది జీవితానికి వర్తించాలనే బాధను వారిలో మేల్కొనేటట్లు చేయాలి. భక్తి పోషకమైన ఆర్తి, మోక్షానుకూలమైన నిర్వేదం అప్పుడుగాని కలగవు. ఒకే విషయాన్ని చెప్పే విధంలో మలుపులు తెచ్చే ప్రతిభ చిలకమర్తి కథకుడుగా ఎలామారిందీ శతకరచనలో కూడా చిలకమర్తి సమయోచిత రచనా సామర్థ్యాన్ని ప్రకటించారన్నది స్పష్టం.

తేటగీతములను కొన్ని తేట తెలుగు
నందు రచియించి సులభమౌనట్టి శైలి
గీతమంజరి యను చిన్న కృతి నొనర్తు
బాలకుల కెల్ల నుపయోగపడెడునట్లు

ఈ ఆశయంతో రాసిన గ్రంథాన్ని అప్పట్లో ప్రభుత్వ పాఠ్యపుస్తక నిర్ణాయక సంఘం 1931 లో ఇంగ్లీషు నేర్చే పాఠశాలలో 1, 2, 3 ఫారాలు చదివే విద్యార్థులకుపయోగించింది.

'సరియయిన మార్గమును బట్టి సంచరించు
నతడు చేరు గమ్యస్థానమ్ము శ్రమమున
ఇనుప పట్టాలపై నుండి యేగునట్టి
ధూమ శకటంబు వలె శ్రేణి దొలగకుండ'

ఉత్తమ మార్గాన సాగి గమ్యస్థానం చేరంగని ఇందులో ప్రబోధం రైలు పట్టాలపైన నడిచి గమ్యం చేరటం చక్కని ఉపమానం. బాలల మనసులకు దగ్గరైన అంశాలే పద్యంలో తీసుకోటం విశేషం.

పౌరుషముచేత మనుజుండు గౌరవంబు
దెచ్చు కొను గాని యది యెవ్వడిచ్చు పనకు
నెవ డొసంగె సింహమునకు మృగేంద్ర పదవి
మేకపోతున కది ఎవ్వడీక పోయె.

తెలివిగల బాలుడును శిక్ష దేఱకున్న
గ్రమముగా మొద్దుబాఱి యక్కఱకు రాడు
తొలుత గాడిద పిల్ల కోమలమెయయ్యు
ముదిరిన కొలంది మిక్కలి మోటబాఱు.

వేసముల నెన్ని మార్పులు జేసికొన్న
నౌకరి పద్ధతి రాదు వేఱొకరి కెపుడు
మేనునలుపైన, పండ్లను మెక్కుచున్న
కాకి యెన్నడు గోయిలగాదు సుమ్ము

ధనము కొంచ కొంచము దీసి దాచిన యెడ
పోగుపడి తుదకది మొత్త మగును
చీమ లల్పరేణువులను జేర్చి కూర్చ
నవియె క్రమముగా బెను పుట్టలగుట గనమె!

చిలకమర్తి వారి గీతమంజరి పద్యాలు చాలావరకు వేమన పద్యాలను పోలినవే. అంతేకాక చిలకమర్తి బాలల నుద్దేశించి రచింపబట్టి కేవలం వారికి అర్థం కావాలని తెచ్చిన ఉపమానాలు చాలా ఉన్నాయి.

మృగేంద్రపదవి సింహానికెవరిచ్చారు!
గాడిద పిల్ల కూడా మొదట్లో ముద్దుగానే ఉంటుంది!
నల్లగా వున్నంత మాత్రాన కాకి కోకిలవుతుందా
చీమ జాగ్రత్తగా నూకలు పోగు చేయటం లేదూ.

ఇలా సింహం, కాకి, చీమ, కుక్క, గాడిద — జంతువుల పక్షుల దృష్టాంతం తీసుకురావటంతో చిలకమర్తి పద్యరచనలో పంచతంత్ర కథలు భాసిస్తున్నాయి.

ఆనాడు విష్ణుశర్మ రాజకుమారులకు నీతిబోధ కోసం, మిత్రలాభం, మిత్రభేదం మొదలైనవి చెప్పినట్లుగా, చిలకమర్తి బాలల నుద్దేశించి నీతి పద్య రచన చేశారు.

శా॥ నీలోనన్ ప్రభవించి వర్ధిలితుదిన్ నీలోన లీనంబులౌ
నీ లోకంబు లటంచు దెల్పుటకునై యేలా పురాణేతి హా
సా లోకంబులు ? నీ సృజించినదియో నా సాలె పుర్వొక్కటి
చాలునన్వ్యర్థము శాస్త్ర చర్చ జగదీశా సత్కృపాంభోనిధీ.

సృష్టిస్థితిలయకారుడైన భగవంతుని తత్త్వం ఓపట్టాన అందరికీ బోధపడదు. అయితే భగవంతుడు సృష్టించిన సాలెపురుగు మోక్షాన్ని పొందింది. పోతన చెప్పిన 'ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై, ఎవ్వనియందు డిందు' - అన్న తత్త్వమే చిలకమర్తి వారి కృపాంభోనిధి పద్యం పురాణేతిహాసాలు కాని, శాస్త్రచర్చకాని భగవంతుని ఉనికిని చూపలేవు. ఆ రూపమే సర్వాంతర్యామిత్వం. అదే సృష్టిస్థితిలయకారకత్వం.

చిలకమర్తి వారు 'దీనకల్పద్రుమ' అనేమకుటంలో 213 పద్యాలు మనోరమ పత్రికలో ప్రచురించారు. తరవాత వాటినే కృపాంభోనిధీ మకుటంగా మార్చి శతకంలో చేర్చారు. ఇది భక్తిరస ప్రధానమైన గ్రంథం, ఎద పలికినపుడు ప్రయోగించుకొన్న భక్తి పద్యాలివి. ఆత్మ న్నాయకమైన ఆర్తి ఇందులో ప్రత్యక్షమౌతుంది.

మ॥ అజుడంచు న్పరమేశ్వరుండంచు బ్రహ్మంబంచు నల్లాయటం
చు యెహోవా యనుచున్ జనార్దనుండటంచు న్శక్తి యంచు న్మమీ
ప్రజని న్నేకద పెక్కునామముల నారాధించు నాత్మీయమో
వృజనం బంతయు బాపుకోదలచి తండ్రీ! సత్కృపాంభోనిధీ !

త్రిమూర్తి కల్పన అర్థరహితమైందని, అల్లా, అజుడు, యహోవా అవతారాలన్నీ వ్యవహార సౌకర్యం కోసం ఏర్పడినవని చిలకమర్తి విశ్వాసం. పరమేశ్వరు డొక్కడే నిర్గుణోపాసనా విధానమే అతనిని చేరే మార్గం.

ఎవరని నిర్ణయించేదిరా - శివుడవో, మాధవుడవో, కమలభవుడవో - అన్న సందేహంలాంటిదే యిది. పైగా చిలకమర్తి బ్రహ్మమతాభిమాని. విగ్రహారాధన నమ్మకం లేనివాడు. సర్వమత సమానత్వాన్ని ఆదరించేవాడు.

శా॥ నీకైంకర్యము సేయబోని పదముల్ సిగ్గోటాళ్ళు సద్భక్తితో
నీకు న్మ్రొక్కని కేలుకట్టె యలుసూ నీ నామసంకీర్తనల్
జోకం బాడని నాల్క తోల్పలక నిన్నుంజూడగా లేనివౌ
నాకన్నుల్ పొగ ముంజకాయతను లోయన్నా కృపాంభోనిధీ

ఈశరీరం భగవన్నిర్మితం దాన్ని భగవత్సేవకే వినియోగించాలి, అలాకాని నాడు అవన్నీ వృథా ఉండిలేనట్టే - భక్తిలో తన్మయాకృస్థితి - ఆనాడు ప్రహ్లాదుడు రాక్షసరాజుతో చెప్పించిదే.

కంజాక్షునికుగాని కాయంబుకాయమే
 పవన గుంఫిత చర్మభస్త్రిగాక
వైకుంఠు బొగడని వక్త్రంబు వక్త్రమే
 ఢమఢమధ్వనితోడ ఢక్కగాగ

చివరికి, విష్ణుభక్తి లేనివాడు "పాదయుగముతోడి పశువు" అంటాడు పోతన ఇక్కడ చిలకమర్తి కూడా అదే బోధిస్తున్నారు అయితే చిలకమర్తి ఇక్కడ, మోక్షగామియైన భక్తుడు.

మ॥ సతియ న్వేరిట స్త్రీలగాల్చెడు దురాచారంబు మాన్పించెద
శ్రుతిమూరాధన మప్రశస్త మనుచున్వాదించి లోకేశ్వరా
ప్రతిమారాధనమున్ మహిన్నిలిపి నీ పాదంబులం గొల్చె జీ
వితుడౌ నాతడిష్ట నిన్నిచట సేవించుం కృపాంభోనిధీ!

రామమోహనరాయలు నిర్యాణశతాబ్ద్యుత్సవ సందర్భమున రచించిన పద్యం ఇది చిలకమర్తి వారి కృపాంభోనిధి శతకంలోనిది

సతీసహగమనాన్ని మాన్పించి, విగ్రహారాధనను వ్యతిరేకించి భారతదేశం మొత్తంలో చైతన్యాన్ని సృష్టించిన వ్యక్తి రాజారామ మోహనరాయలు ఆయనంటే అమితగౌరవం చిలకమర్తికి. ఆయన సంస్మరణార్థం చెప్పిన పద్యంలో చిలకమర్తి నమ్మినసిద్ధాంతాన్ని ప్రచారంచేయడం గమనించదగింది.

శా॥ ఆలుంబిడ్డలు నిల్లువాకిలియు దేహం బంగముల్విస్ఫుర
చ్చేలంబు ల్మణిభూషలుం బరిజనుల్సింగారముల్గల్గి భూ

పొలుండట్టులు భోగభోక్తవని నిన్వర్ణింతు రజ్ఞానులై
నీలీలల్గనలేని బాలిశులు తంట్రడీ సత్కృపాంభోనిధీ

దేవునికి గుడికట్టడం, పేరు పెట్టడం, అలంకారాలు చేయడం, ఆభరణాలు చేయడం- అనుభూతి పొందడం ఎంత అజ్ఞానులు నిరాకారుడికా. యివన్నీ - ప్రజల మూఢత్వానికి అజ్ఞానానికి నవ్వుతున్నాడు చిలకమర్తి. ఇదే తత్త్వం వేమనలో కనిపిస్తుంది.

రాళ్లు తెచ్చి నరులు రమ్యమౌ గుడికట్టి
రాతి ప్రతిమ చేసి ఖ్యాతిగాను
దేవుడనుచు పల్క- దీవించి పల్కునా- అంటాడు వేమన్న.

అంతేకాదు, రాతి బొమ్మకేల రంగైన వలువలు
గుళ్ళు గోపురాలు కుంభములును
కూడు గుడ్డ తానుకోరునా దేవుడు-

చిలకమర్తి కూడా విగ్రహారాధన వ్యతిరేకిస్తూ మానవుల అజ్ఞానాన్ని చూసి జాలిపడటం జరిగింది.

మ॥ అనుగైయెప్పుడు దోడునీడయయి కన్నె చేయియై ప్రాణమై
ననుసేవించె ననేక వర్షములు । గానన్ నెమ్మనంబెంతయున్
ననటం జెందెను, దుఃఖ వారిధి తరింపన్నాకు ధైర్యంబు ప్రీ
తిని చేకూరిచి యామె కాత్మకిడు శాంతిన్ సత్కృపాంభోనిధీ!

'కృపాంభోనిధి' శతకంలో చివర కీర్తి శేషురాలైన తన భార్యను గూర్చిన అనుతాపాన్ని వ్యక్తం చేస్తూ ఆమె ఆత్మకు శాంతి చేకూర్చమని భగవంతుని ప్రార్థించే పద్యం ఎంతటి గట్టి గుండెలైనా ఇక్కడ కరిగి జాలు వారతాయి.

భార్యా భర్త ఒకరికొకరు తోడునీడ. అంతేకాదు శారీరార్థ భాగమే భార్య. చిలకమర్తిని కన్నె, చేయియై, ప్రాణమై? ఆమె సేవించింది. ఆమె ఉత్తమురాలు ఆ ఇంటికి ఎందరో బంధువులు వచ్చేడివారు, పేద విద్యార్థులు వచ్చేడివారు,

ఎవరు వచ్చినా విసుగులేక ఆదరణతో వండిపెట్టి ఆదరించే ఉత్తమ ఇల్లాలామె, ముప్పది రెండు సంవత్సరములు కలిసి జీవించారు భార్యావియోగం చిలకమర్తిని ఆధ్యాత్మిక చింతన వైపుకు లాగింది.

మ॥ ఎవెసర్వేశ్వరుడాచరించునది మేలేకాదు గాదంచు గో
విదులెల్లన్వచి యింద్రతుగాన మదినిర్వేదంబునుందక్కి దక్కియుం
డదు నీ యానతియైనదాక యిహమందున్, మీది కార్యంబు నీ
యది నీ చిత్తము నాదు భాగ్యమట దేవా తత్కృపాంభోనిధి

అన్నారు. అర్తినుండి ఆత్మశాంతి వరకూ సాగే అంతరంగ ప్రస్థానమిది దేవుడేది చేసినా మన మేలుకే అని నమ్మి. భగవంతుని పిలుపుకై ఎదరుచూస్తూ కాలం గడప నిశ్చయించుకున్న నిశ్చల మానసిక స్థితిలో వున్నారు. చిలకమర్తి తాను నిమిత్తమాత్రుడననే విషయం మరోసారి నొక్కి చెప్పటంమిది.

మ॥ జలమందుండుట తిండిమానుటయు నిస్సంగత్వముంబొందుటా
కలమున్ మెక్కుట మోక్షసాధనములా! యట్లైన చేపలా దరి
ద్రులు షండున్ మఱి వానరంబులును సద్యోమోక్షముం గాంచవే
తెలియంజాలని వారి త్రోవ లివియే దేవా! సంత్కృపాంభోనిధి!

నీళ్ళలో మునిగి వుండటం, తిండి మానివేయటం, సన్యాసం స్వీకరించటం ఇలాంటి వాటివల్లే మోక్షమొస్తే నీళ్ళలో వుండే చేపలు, తిండిలేని దరిద్రులు చెట్లెక్కిన కోతులు- అన్నిటికీ మోక్షం రావాలిగా మరి - మోక్షం అంత తేలికగా వస్తుందా! అని ప్రశ్నించటం, మోక్షం అంత తేలికైతే అందరికీ సాధ్యమేగా మరి- అదికాదు కర్మాచరణ ముఖ్యము అని చిలకమర్తి నమ్మకం.

ఇందుగలడందులేడని సందేహమువలదు.
ఎందెందు వెదకి చూచిన అందదేగలడనే

ప్రహ్లాదతత్త్వం అర్థమవటం అందరికీ సాధ్యకాదు 'తెలియం జాలని వారి త్రోవలివి' అని చిలకమర్తి అనటంలో ఉద్దేశమిదే అజ్ఞానులైన మానవులకు దారి చూపించి మోక్షమార్గం వెంటనడిపించాలి అని

మ॥ కనులంజూడము నిన్ను వీనుల వినంగారాదు నీ శబ్దమై
నను, నీ మేను స్పృశింపజాల మయినన్ సర్వేశ్వరుండున్నవా

డని తోచుచున్నది దానికిన్ దొరకవీ వల్భ్యార్థ్య। యే యింద్రియం
బునకున్ సాధ్యుడవౌదువో యెఱుగ శంభూ, శ్రీకృపాభోనిధి

భగవంతుడున్నారంటారు-తన కళ్ళకు కనబడడు, ఓంకార రూపాత్ముడం టారు, కానీ ఆ శబ్దం చెవులకు వినబడదు.

ఆజానుబాహుడవని, పద్మనయనంబుల వాడవని ఏదో చెప్తుంటారు, కాని శరీరం తాకలేను - అయినా సర్వేశ్వరుడున్నాడని మనసుకనిపిస్తుంది. - మరి ఏ ఇంద్రియాలకూ అనుభూతుడవు కాని నువ్వు మరిదేనికి సాధ్యుడవౌ తావని గుర్తించగలనో నీవే చెప్పుతండ్రి అని దీనంగా ప్రార్థించటం యిది భగవం తుని అస్తిత్వంలో నమ్మకం. 'కలడు కలండని వాడు కలడోలేడో' తెలియనిస్థితి

ఈ పద్యానికి సరిగ్గా సమాధానంగా మరో పద్యం చేర్చారు. చిలకమర్తి.

మ॥ ఎది వాక్యంబుల కందరాని దగునో, యెద్దాని కారుణ్య సం
పదచే నాల్కం మాటలాడ గల సామర్థ్యంబు చేకూరునో
యదియే బ్రహ్మముగా నెఱుంగు.... .... .... ....

మ॥ ఎది కందోయి కగోచారంబగునో, యెద్దాని మహత్మ్యం సం
పదచే నేత్ర యుగంబు చూడగల సామర్థ్యంబు ప్రాప్తించునో
యదియే బ్రహ్మముగా నెఱుంగు.... ....

మ॥ ఎది శ్రోత్రంబులచే వినందగనిదో యెద్దాని సాహయ్య సం
పద వీనుంగవకున్ వినదగిన సామర్థ్యంబు చేకూరునో
యదియే బ్రహ్మముగా నెఱుంగుమని వేదాంతంబు నిన్ గూర్చియే
గద భాషించెడు నెల్లవేళల నకలంకా సత్కృపాంభోనిధి!

ముందు చెప్పిన దానికి సమర్థనీయంగా చెప్పటంలో విశేషం యిది. భగ వంతుడు కళ్ళకు కనిపించడు అంతే, గాని కళ్ళతో చూడ్డం సాధ్యంకాక పోయిన భగవదనుగ్రహంతో చూడగలమో వాక్యాలకందరానిది భగవదనుగ్రహంతో నోట పల్కగలమో ఏది వినలేమనుకుంటున్నాము అది భగవదనుగ్రహం వల్ల విన సామర్థ్యం గలుతుందో అదే బ్రహ్మము. అదే బ్రహ్మము, అదే బ్రహ్మము అంటున్నారు. పైమూడు పద్యాల్లోభక్తిఒకరకమైన చిత్త పరిపాకం భగవదన్వేషణలో

అంతరాత్మ పునీతమౌతుంది. అంతఃశత్రువులను వెలికి పారవేస్తోంది. ఈ స్థితి చిలకమర్తి వారి కృపాంభోనిధి పద్యాల్లో చాలాచోట్ల కనిపిస్తుంది.

మ॥ అమృతం బవ్యయ మద్వితీయ మానవద్యం బప్రమేయంబ నా
ద్య మనంతం బజరం బనామయం మకాయం బక్షరం బచ్యుతం
బమలంబప్రతిమం బగోచర ము నవ్యక్తం బగమ్యంబ చో
ద్యమునై వెల్గెడు బ్రహ్మ ముందలతు నిన్నన్నా కృపాంభో నిధి

ఈ పద్య రచనలో విశేషమొకటే - అవాఙ్మాన సగోచరమైన బ్రహ్మని ఆకారంతో ప్రారంభమయ్యే అన్ని విశేషణాలతోను కీర్తించటం ఒక చమత్కారం

శతక పద్య రచనలు భావానుకూలంగా ప్రసరించే ఛందోవాహినుల్లా కనిపిస్తాయి

మ॥ జయ, కల్యాణ గుణాలవాలజయ. విశ్వశ్రేయ సంధాయహే
జయ, యోగీంద్ర మనో నివేశ జయ దోషధ్వాంత మార్తాండ హే
జయ, సర్వాంతర బాహ్యవాస। జయ, నిష్కామక్రియాలోలహే
జయ, మోక్షప్రద, సత్యరూప జయ, హేశంభో. కృపాంభోనిధి

ఇది తెలుగు పద్యమూ అవుతుంది. సంస్కృతశ్లోకమూ అవుతుంది. దానికి అనువుగా చివర "కృపాంభోనిధి" అమర్చారు చిలకమర్తి. స్తుతి పద్యాలలో సంకీర్తనం ఒక పద్ధతి.

దీన్ని సంస్కృత శ్లోకమనకుండా చిలకమర్తి మత్తేభవృత్తమన్నారంతే??

అరవిందాసను గొల్వ బోవుటను ధన్యంబయ్యె దేహంబు, త
చ్చరణాబ్జంబుల బూజసేయుటనుముళ స్తంబయ్యె హ స్తంబు, త
ద్వర మూర్తినినుట ఫలంబయ్యె నేత్రద్వంద్వమాతేజక మున్
స్థిర భక్తిన్మది నిల్పు భావనత గాంచెన్మానసం బెంతయున్

ఇది గయోపాఖ్యానం పద్యం. గయుడు ఉదాత్తుడు, ప్రమాదవశాన చేసిన నిష్ఠీవనం అతనిలో కనబడే కించిల్లోపం. తప్పుచేసినా-పశ్చాత్తాపాగ్నిలో తనశీలాన్ని పుటం పెట్టుకున్నవాడు గయుడు చతురానన సేవాభాగ్యంతో లభించిన ధన్యుడు.

అరవిందాసను పూజచేయుట వలన అతని హస్తము, ఆ మూర్తిని చూడ గల్గుట వలన అతని నేత్రద్వయము. భక్తిని స్థిరంగా మనసులో నిల్పగల్గుటచేత అతని మనసు ధన్యమైంది.

కమలాక్షునర్చించు కరములు కరములు

శ్రీనాథుని వర్ణించు జిహ్వ జిహ్వ – అన్న భావం గయుని తాత్త్విక చింతనపై మనస్సు మరల్చింది అయినా తను ప్రజలను పరిపాలించాలి. యాచకులకు దానం చేయాలి, అందుకే బ్రహ్మదేముడు వరములు కోరికొమ్మన గానే కోరుకున్నాడు అయితే ఈ కోరికలో స్వార్థంలేదు. ఈ కోరికలో ధన్యత్వం వుంది. ఆ పద్యం ఇది—

మ॥ ధనమీయం గదె పాత్ర మానకుండు స్థానంబుగా వింపగా
ఘనబాహాబల మీగదె కుజన శిక్షా దీన రక్షార్థమై
మనసీ యంగదె చాలకాలము బ్రహ్మజ్ఞాన మర్థింపగా
జన నీయంగదె ధర్మమార్గమున నిచ్చల్లోక సౌఖ్యార్థమై

ఆతడు కోరుచున్నది ధనాన్ని, బలాన్ని, జీవాన్ని-అయితే అవేవీ ఇహలోక సుఖంకోసం కాదు. ధనాన్ని పేదదానానికి, బలాన్ని దుర్జన శిక్షణకీ, దీనజన రక్షణకి జీవనాన్ని బ్రహ్మజ్ఞాన సాధనకి కోరుతున్నాడు. ఇలాటి ఉదాత్తాశయాలతో వరాలు కోరుతున్న గయుడు బ్రహ్మ వరాలు పొందిన తర్వాత విరక్తిని భజించాడు. జ్ఞానసాధనకి అది తొలిమెట్టు. సాధనకు శరీరం సాధనం బ్రతక్కపోతే బ్రహ్మవరం పొల్లైపోతుంది బ్రతికితే కృష్ణుని శపథం వమ్మైపోతుంది. చివరకు బ్రహ్మజ్ఞానాన్ని సాధించటానికే అతను నిశ్చయించుకున్నాడు.

సీ॥ ఎవ్వాడు నయనాగ్ని బ్రోవ్విన పువువిల్తు
నిమిషార్థ మిందున నీఱుజేసె
ఎవ్వాడు చిటికలో నేను మోములు గల్గు
నాళీక గర్భుని నలువజేసె
గుబుసంబు వాడ్చిన క్రొందెతాచుల గుంపు
మేన నెవ్వడు దాల్చుమేటి నగలు
కడలి ద్రచ్చగ బుట్టుగాల కూట విషంబు
ముద్దలేనికి వెన్నముద్దలయ్యె
బునుకదండ లెవ్వానికి బూలసరులు
పులికళాస మెవ్వానికి జిలుగు విలువ

పూలచందురుదెవ్వాని బొమిడి కంటో
యమ్మహాదేవు గన దొంటి నార్తిదీఱ''

గయుడు శివుణ్ణి శరణువేడాడు. ఇక్కడ శివుని గరళకంఠునిగ, నాగ భూషణునిగ, త్రినేత్రునిగ వర్ణిస్తూనే ఎవడు, వాడు అనటంలో ఒక ప్రత్యేకత. ఎవడో-వాడు అని చెప్పటమే అది- భక్తుడు. ఆ గయ్యాడు భగవంతుని వెతుక్కొని చివరకు ఆర్తి తీరిందని విశ్వసించాడు. కష్టంలో భకుడు చేసేది మరే ముంది దీన జనరక్షకుణ్ణి వెతుక్కోటం తప్ప మరో మార్గంలేదు.

చిలకమర్తి పద్యరచనలో మరో విశేషం మధ్యతరగతి కుటుంబాల వ్యవస్థకి దగ్గరగా వుండేట్లు రచన చేయటం పాత్రలను తీర్చి దిద్దటంతోను, సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు, నెప్పిపోటువులు మొదలైనవాటి ద్వారా మనసుల్ని ఆకట్టుకోటం చిలకమర్తి నేర్చిన విద్య. నాలుకకు పద్యాలు రక్తికట్టడానికి ముఖ్య కారణం ఇదే.

'మగువ మీదను పతికెంత మక్కువైన
మగువ మీదను సతికెంత మమతయున్న
ఉవిదకు కాపురంబెంత యొప్పియున్న
పుట్టినింటికి కడుగూర్చు పొలతి యెపుడు

ఇది అర్జునుడు సుభద్రని నిందించే పద్యం భర్తక్షేమాన్నికోరి, కృష్ణునితో తగవు తగదని తలచి, గయుని వలన కృష్ణునితో వివాదం రావడం ధర్మంకాదని చెప్పడానికికొచ్చింది సుభద్ర. అయితే అర్జునుడు అవే మాటలాదరింప లేదా పుట్టింటిపైనే ఆడవాళ్లకభిమాన మెక్కువని తిరస్కరించే పంపుతాడు. పాపం సుభద్ర అక్కడనుంచి కృష్ణుని దగ్గరకొస్తుంది.

సారె చీరెలు నగలును చాలగొనుచు
పుట్టినిండ్లను గుల్లలు జేసిపోయి సతులు
తుదకు మగని పక్షముచేరి ఎదురగుదురు
మగనిపై కూర్మి అధికము మగువకెపుడు

కృష్ణుడు సుభద్రనే నిందిస్తాడు. పుట్టింటి నుంచి సారె చీరలు తీసుకెడుతూనే పుట్టింటిని గుల్లచేసిపోయి భర్త పక్షాన్నే వుంటాయి. ఆడవాళ్ళు అంటాడు,

సుభద్రస్థితి ముందు నుయ్యి వెనక గొయ్యిలా అయింది. అయితే ఈ పరిస్థితి ఎదుర్కొనిన తెలుగు ఆడపడుచులు లేరంటే అతిశయోక్తి లేదు. అందుకే ఈ పద్యాలు తెలుగుదేశంలో ఎందరికో అనుభవంలో వున్నవి, ఇష్టమయినవి అయ్యాయి. బావమరిదిని సాధించటం, వెక్కిరించటం తెలుగు ఇండ్లలో పరిపాటి అందుకే చిలకమర్తి గయోపాఖ్యానంలో అర్జునుని నోట పల్కించారు హేళనగా కృష్ణుని గురించి,

అన్ని యెడలను నేను మీ యన్నవోలె
జిగురుబోండ్ల మాటలే పాటి సేయుదీ నని
తలచి వచ్చితివి కాబోలు దౌత్యమునకు
నెలతలా రాజనీతులు నేర్పువారు. —

బావమరది ఎంతటివాడయినా బావకు లోకువే లోకంలో

తే॥ మేకవన్నియ బెబ్బులెమ్మెరుగు గలుగు
తేనెపూసిన కత్తులు తెలియరాని
మీరు పయోముఖ విషకుంభ తతులుగాక
వారు మేనత్త కొడుకులుగారు మాకు- ఈ పద్యం

కృష్ణుడు కోపంతో దేవకితో అంటున్నాడు పాండవులు మేనత్తకొడుకులా కారు, మేకవన్నె పులులు, తేనెపూసిన కత్తులు, పయోముఖ విషకుంభాలు అన్న ఉపమానాలు ఒక తేట గతిలో అమర్చారు. చిలకమర్తి

ఆ॥ పేరు ధర్మరాజు వెనుగు వేప విత్తండ్రు
మాట తేనెతేట మనసు విషమా
నేతి బీరకాయ నీ యుధిష్ఠిర శక్తి
ఎఱుకలేనివాని యెదుట బొగడు.

ఈ పద్యం కృష్ణుడు ధర్మరాజును నిందించటం.

తే॥ అదితి కశ్యపులకు గుజ్జువగుచు బుట్టి
అడుగు కొనలేదె నేల మూడడుగు లీవు
నీవు నేర్పిన విద్యయె నీరజాక్ష
భిక్షమెత్తుట యిది కొత్త విద్య కాదు.

ఈ పద్యం అర్జునుడు కృష్ణుని నిందించటం "నీవునేర్పిన విద్యయే నీరజాక్ష" అన్నది తెలుగునాట ఎందరినోట నో వాడుకైంది. చిలకమర్తి పద్యరచనలో లోకోక్తులు కోకొల్లలు.

తే॥ ఖలుండనేనియు గావ కంకణముదాల్చి
సఖిన రాధుండు భక్తుని నన్ను జంప
బ్రతిన గైకొన్న రక్షించు వాడెవండు
కంచెయేచేను మేసిన గలదె దిక్కు

తే॥ కదలిలోపల జక్కెర కలిపినట్లు
బూడిదను మంచిపన్నీరు పోసినట్లు
వినయ గర్భితమైన నా విన్నపంబు
నిష్ఫలం బయ్యె నీచెస నీరజాక్ష

కంచె చేను మేయటం, బూడిదలో పన్నీరు పోయటం అందరికీ తెలిసిన లోకోక్తులే.

సీ॥ నా మనోహరు గాంచి నన్ను రక్షింపరే
వేల్పులార । పుడమివేల్పులార
నాప్రాణవిభు బ్రోచి నన్ను పాలింపరే
సిద్ధులార । రణప్రసిద్ధులార
నాపల్లభుని నేలి నన్ను మన్నింపరే
యక్షులార । బలహర్యక్షులార
నా నాధు గృపనోమి నన్ను గాపాడరే
మౌనులార । సురసమానులార

దిక్కులేని వారలకెల్ల దిక్కుమీర
గలి దొలంగు వారలకెల్ల గతియుమీర
మొఱలు వినరయ్య । రారయ్య పూనరయ్య
గయుని రక్షింపరయ్య । నన్ గావరయ్య

గయునిభార్య చిత్రలేఖ మొరయిది. అయితే సీసపద్యరచనలోని విశేషమంతా ఆ సంబోధనల లోనేవుంది. పైగా అంత్యానుప్రాసతో పద్యమునడకకు కొత్త అందంవచ్చింది - పైగా దీనురాలిస్థితి - వేల్పులతో మొదలుపెట్టి, సిద్ధుల్ని

యక్షుల్నీ, మౌనుల్నీ వేడుకుంది. వినరయ్యా, రారయ్యా, పూనరయ్యా, రక్షింపరయ్యా కరుణరసాత్మకమైన స్థితి.

ఆనాటి గజేంద్రుడు "రావే ఈశ్వర, కావవే వరద సంరక్షించు భద్రాత్మక'' అని వేడుకోటము ఆర్తితోనే.

ఇంకా అలనాటి సీతను రావణుడు గగనమార్గాన కొనిపోతున్నాడు.

"పావనాకార గోదావరీదేవి నీ
వెఱిగింపవయ్యా రాజేంద్రుతోడ
నో మాల్యవంత పుణ్యోన్నతగిరి
నాథ చెప్పంగదే రాజసింహుతోడ....

అంటూనే,

....విడిపింపరయ్యా కావ
రయ్యా సురలార, మునులార, యక్షులార
యఖిలదిక్పతులార పుణ్యాత్ములార ..... (భాస్కర రామాయణము)

సంబోధనాత్మక సీసపద్యం శక్తిమంతమైంది.... అలవైకుంఠ పురంలో ఉన్న వాణ్ణి కూడా కదిలించగలిగింది. చిత్రలేఖ దీనావస్థను తెల్పుతూ సీసపద్య రచన ఇలాచేయటం చిలకమర్తి పద్యరచనా విశేషం

తే॥ అంతవాని యంశమ్మున నవతరించి
యింతవానికి స్నేహితుడ నగుచు
నెంతలెంతలో కార్యంబు లేనసిజేసి
యింతటి యకార్యమొనరింప నెట్టులోర్తు

ఇది గయోపాఖ్యానంలో అర్జునుడు చెప్పింది. కృష్ణుడు అర్జునునకు పూర్వ జన్మ వృత్తాంతం చెప్తున్నాడు. బదరికావనంలో అత్యంత నిష్ఠాగరిష్ఠులైన నర నారాయణులు తపఃపరతంత్రులై ఉన్నారు అందు నరాంశములో అర్జునుడు, నారాయణాంశములో కృష్ణుడు జన్మించారు. ఇది యదార్థం చూడుమని కృష్ణుడు అర్జునుని కనులు తుడిచాడు. చూచాడు. అర్జునుడు ధన్యోస్మి, ధన్యోస్మి అను కున్నాడు.

నరనారాయణాంశ కనక అంతవాని అంశ
నారాయణుని స్నేహం కనుక ఇంత వానిస్నేహం
ఇద్దరు కలిసి చేసినపనులు ఎంతెంతలోయైన కార్యాలు

ఇలా చెప్పడంలో అంత, ఇంత. ఎంత అన్న పరిమాణ వాచక ప్రయోగం వల్ల ఎంతో ఊహకందనంత అని చెప్పడానికి అవకాశం కలుగుతోంది.

భగవదంశని ఇంక అని చెప్పడం సాధ్యంకాదు కదా అందుకే చిలకమర్తి చమత్కారంగా

అంతవాని అంశ
ఇంతవాని స్నేహం అని సమర్థించేశాడు.

వ్యంగ్యరచనా వైభవానికి చిలకమర్తి వారి నరకాసురవధ నాటకపద్యాలే ఆధారం.

ఊర్వశి నరకాసురుణ్ణి తిరస్కరించింది. పైగా తను దేవేంద్రుని వలువు గత్తెకనుక, ఇంద్రు నియందలి గౌరవం చేత గానులోకమాతగా పరిగణింపదగిన దని చెప్తుంది అక్కడ చిలకమర్తి చాలా ఘాటైన పద్యంచెప్పి వేశ్యావృత్తిని వెక్కిరించారు.

తే॥ మగువ ! నీయందు నింకింత మహిమలుంట
యింతకాలము నుండి నే నెన్నడెఱుగ
గ్రొత్త సంగతుల్వేరిచి కొంటినహహ
ప్రాత లంజలిప్పుడు లోకమాతలైరి''

అంటాడు నరకాసురుడు.

సంఘంలో వున్న వేశ్యావృత్తిని తరిమివేయాలన్న బద్ధకంకణులలో చిలకమర్తి ఒకరు. ఎన్నో ప్రహసనాలలో కూడా ఈ సాంఘిక దురాచారాన్ని ఎత్తి చూపారు. అంతేకాక వీలుదొరికినపుడల్లా విమర్శించారు.

"ఎవడు ధనమిచ్చిన వాడె మగడటంచు
బ్రహ్మ మూడు పంక్తుల వ్రాసె నుదుట
గడుసుపోకలు నిక జాలు గట్టిపెట్టు

సకియ, నీయాట లిచ్చట సాగిరావు -

ఇంత హేయంగా ఊర్వశి పాత్రను గూర్చి పల్కటంలో చిలకమర్తికి

వేశ్యావృత్తి పై నున్న ఏవగింపే కారణం

హాస్యరసం ఉట్టిపడే రచన కూడా ఈ నాటకంలోవుంది. యుద్ధరంగానికెడుతున్న కృష్ణునితో తనూ వస్తానంటుంది సత్యభామ. ఇక్కడ తేటగీతి పద్యాన్ని రెండుముక్కలు చేసి సంభాషణాత్మకగతి దానికి కల్పించారు చిలకమర్తి. సత్యా కృష్ణుల సంభాషణ తేటగీతిలో నిబంధించారు

సత్యభామ :-

తే॥ సగము దేహంబు నింటిలో నిక్కవిడిచి
యనికి మీరు పోవుట యేటి న్యాయ మనఘ

కృష్ణుడు :-

ఎనిమిది సగంబులున్నవో యిందువదన
యే సగంబును గొనిపోదు నిప్పుడేను -

అయితే సత్యభామ సరససంభాషణలో చతురురాలు. అందుకే వెంటనే ఏ సగము మీ వెంట రాదలుచుకొన్నదో ఆ సగమే గొనిపొండి అంది. కృష్ణుడు సత్యభామ యుద్ధనేర్పరితనాన్ని చూసివిస్తుపోయి, ఆమెను ప్రశంసించాడు.

"ఎగిరిపడితి నిన్నాళ్ళను
మగవాండ్ర భుజాబలంబు మాటగనక ని
గ్గగునిప్పుడు మీముందర
మగువా ఇక సాగిరావు మా మగతనముల్''

ఇంతకాలం గర్వపడిన మా మగతనం ముందు నేడు నిగ్గుపడుతున్నాడట జగన్నాటక సూత్రధారి యదునందనుడు.

తే॥ ద్వాపరంబున రెండు చిత్రములు గంటి
జలజలోచన నీ సాహసంబు కతన
ఆడువారికి పౌరుషం బమరునొకటి
యబలభావంబు మగవారి కబ్బుటొకటి

చిలకమర్తి నిజజీవితంలో స్త్రీ జనాభ్యుదయాన్నాకాంక్షించాడు. 'ముదితల్ నేర్వగరానివిద్దెకలదే ముద్దారనేర్పించినన్' అన్నాడు. స్త్రీలకు విద్యావసరాన్ని వ్యక్తిత్వనిరూపణాన్ని ప్రబోధిస్తూ ఆయన ఎన్నోరచనలు చేశారు.

సీసపద్యరచన చిలకమర్తికి నల్లేరుపై బండినడక వివిధరకాల సీస పద్యాలు చిలకమర్తి కవితావైభవానికి దోహదం చేశాయి.

ప్రశంసాత్మక సీసం :-

విశ్వపావనమైన వినువాక యెవ్వాని
　　యడుగు దమ్ముల బుట్టు నలరుదేనె
భువన భారమ్ముదాల్పు భోగీంద్రుడెవ్వాని
　　పవళించుమెత్తని పట్టుపాన్పు
అమృతంబువొడమిన యంబోధి యెవ్వాని
　　రాణి వాసములుండు రాచనగరు
పరమేష్ఠి యావిర్భవమ్మున కెవ్వాని
　　పొక్కిలి కెందమ్మి పురిటి యిల్లు

ప్రామినుకులెల్ల నెవ్వాని పరగుణాళి
వరుస గైవార మొనరించు వందిగణము
అట్టి నిను గాంచి ధన్యుడనైతి నిప్పు
డఖిల కల్యాణ గుణ సాంద్ర యాదవేంద్ర

అధిక్షేప సీసం :

అల్లుడా రమ్మని యాదరమ్మున బిల్వ
　　బంపుమామను బట్టి చంపగలమె
జలకేళి సవరించు జవరాండ్ర కోకల
　　నెత్తుకపోయి చెట్టెక్కగల మె
యిల్లిల్లు దిరిగి ప్రేపల్లెలో ముచ్చిలి
　　మిసిమి ముద్దలు దెచ్చి మింగగలమె
గొల్లబొట్టెల గూడి కొల సేకోని యాల
　　కదుపుల నేర్పుతో కాయగలమె

తలిదండ్రులు పరుల కీ దలచుకన్య
బలిమియై తెచ్చి భార్యగా బడయగలమె
దుష్టులను వంక వీరుల ద్రుంపగలమె
అనపరాధుల దండింపనరుగ గలమె

అనునయ సీసం :

నిగబంతి నీకేమి బగయొనర్చిన దిష్ట
ధరియింప కుంటివో తలిరుబోడి
హరిచందనం బేమి యప్రియం బొనరించె
మైబూయ కుంటవో మధురవాణి
పన్నీరు సల్పిన పాపకర్మ మదేమి
జలకంబు మానవో జలజనేత్ర
జిలుగు దువ్వలువలు చేసిన యెగ్గేమి
కట్టకుంటవు నేడు కలికిమిన్న
తప్పుగల వారి దండించు టొప్పుగాని
యనపరాధుల శిక్షించుటర్హమగునె
నిఖిల ధర్మంబు లెరిగిన నిన్నుబోలు
రాచబిడ్డకు సింధుర రాజయాన!

స్తుతి సీసం :

జయ దేవకీ గర్భ జలధి కైరవమిత్ర
జయ దళత్కంజ విశాలనేత్ర
జయ మహాపాతక జంబాలమార్తాండ
జయ శైలజాధవ చాపఖండ
జయ నీలనీరద శ్యామలాంగ విలాస
జయ మౌని హృత్కుశేశయనివాస
జయ రమామానస జలజాత మదభృంగ
జయ మదాసుర చమూ చయ విభంగ

చరణ నిర్గత స్వర్గంగ సాధుసంగ
కరధృత రథాంగ భవ తమోహర పతంగ
జయజయాండజేంద్ర తురంగ జయము రంగ
వేల్పుగొంకల గొంకయో వెన్నదొంగ!।

ఆ పద్యరచనా చమత్కారం తోనే నాటక రంగాన్ని వశపరచుకొన్నారు చిలకమర్తి. ఆశుకవితలైనా, శతక పద్యాలైనా, నాటక పద్యాలైనా చిలకమర్తి చేత పడి ధన్యమైనా యనటం అతిశయోక్తి కాదు.

చిలకమర్తిని కవిగా పరిచయంచేసింది, వారు వివిధ సభల్లో చదివిన పద్యాలే. బాల్యంలో నరసాపురంలో మిషను స్కూల్లో చదువుకొనేటప్పుడు ఏలేశ్వరపు వేంకటప్పయ్యశాస్త్రిగారి దగ్గర ఛందోవిషయసార సంగ్రహాన్ని చదువుకొన్నారు. విక్టోరియా రాణి స్వర్ణోత్సవ సభాసమయంలో కొన్ని పద్యాలు రచించారు. కాని అవి వారి స్నేహితులొకరు చదివారు. అందువల్ల కవిగా చిలకమర్తి పేరు బయటకి రాలేదు వేదం వేంకటరాయశాస్త్రి గారి సన్మానసభలో చిలకమర్తి పద్యాలు చదవటం, ఆ పద్యాలు బాగున్నాయని సభలోవారు మెచ్చుకోవటం జరిగింది. ఆ తర్వాత ఆశుపద్యాలు చెప్పటం మొదలైంది. నాటకకర్తగా, నవలారచయితగా, ప్రహసనకర్తగా ప్రసిద్ధికెక్కిన చిలకమర్తి వారి కవితా వైభవం తెలుగుసాహిత్యంలో సముచితస్థానాన్ని సంపాదించు కొందనటం అతిశయోక్తి కాదు.



మా తెలుగు తల్లికీ మల్లెపూదండ
మా కన్నతల్లికీ మంగళారతులు
కడుపులో బంగారు, కనుచూపులో కరుణ
చిరునవ్వులో సిరులు దొరలించు మా తల్లి

గలగలా గోదారి కదలిపోతుంటేను
బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను
బంగారు పంటలే పండుతాయి
మురిపాల ముత్యాలు దొరలుతాయి

అమరావతీ నగరి అపురూప శిల్పాలు
త్యాగయ్య గొంతులో తారాడు నాదాలు
తిక్కయ్య కలములో తియ్యందనాలు
నిత్యమై, నిఖిలమై నిలిచియుండేదాక

రుద్రమ్మ భుజశక్తి, మల్లమ్మ పతిభక్తి
తిమ్మరుసు ధీయుక్తి, కృష్ణరాయల కీర్తి
మా చెవుల రింగుమని మారుమ్రోగేదాక
నీ పాటలే పాడుతాం నీ ఆటలే ఆడుతాం
జై తెలుగుతల్లీ, జై తెలుగు తల్లీ

— శంకరంబాడి సుందరాచార్య

Blank Page

మా తెలుగు తల్లికి మల్లెపూదండ
మా కన్నతల్లికి మంగళారతులు
కడుపులో బంగారు, కనుచూపులో కరుణ
చిరునవ్వులో సిరులు దొరలించు మా తల్లి

గలగలా గోదారి కదలిపోతుంటేను
బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను
బంగారు పంటలే పండుతాయి
మురిపాల ముత్యాలు దొరలుతాయి

అమరావతీ నగరి అపురూప శిల్పాలు
త్యాగయ్య గొంతులో తారాడు నాదాలు
తిక్కయ్య కలములో తియ్యందనాలు
నిత్యమై, నిఖిలమై నిలిచియుండేదాక

రుద్రమ్మ భుజశక్తి, మల్లమ్మ పతిభక్తి
తిమ్మరుసు ధీయుక్తి, కృష్ణరాయల కీర్తి
మా చెవుల రింగుమని మారుమ్రోగేదాక
నీ పాటలే పాడుతాం నీ ఆటలే ఆడుతాం
జై తెలుగుతల్లీ, జై తెలుగుతల్లీ

— శంకరంబాడి సుందరాచార్య